# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :46 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 16-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## విశాఖలో వైసిపికి మరో షాక్

విశాఖపట్నం, విశాఖపట్నంలో తాజాగా వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మేయర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన సమయంలో వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు.. ఆ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. ఆ పార్టీ సీనియర్ నేత బెహరా భాస్కర్ రావుతోపాటు– 91వ వార్డు కార్పొరేటర్ జోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివ దేవ రాజీనామా చేశారు. అయితే వీరు మరికొద్ది రోజుల్లో జనసేన పార్టీలో చేరనున్నారు. అందుకు ముహూర్తం సైతం ఖరారు అయినట్లు– తెలుస్తోంది. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో వీరు ఆ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు– సమాచారం. మరోవైపు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయ రసవత్తరంగా మారాయి. వైసీపీ నేత, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నోటీ–సు జారీ చేసే నేపథ్యంలో ఇద్దరు వైసీపీకి కార్పొరేటర్లు రాజీనామా చేయడం ఆ పార్టీ నేతలో ఒకింత విస్మయం వ్యక్తమవుతోంది.

## ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టాల్సిందే




న్యూఢిల్లీ,ఏప్రిల్15: దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయిలో ఉ ండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా శిలాజ ఇంధనాలు తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మళ్లాలని ఆయన సూచించారు. మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ...ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు రావాలన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణాలు కాబట్టి వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ. 22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటు–న్నామని.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాల్సిన సమయం వచ్చిందన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకువెళు న్న భారత్ రవాణా, విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టిపెడుతోందన్నారు. ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు చేయడం ఖాయమని అన్నారు. కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబయి రెడ్‌జోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఢిల్లీలో పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడి ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్లకు తగ్గుతుందని.. వైద్య పరిశోధనను ఉ టంకిస్తూ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా ప్రాధాన్యం ఇస్తామో అలాగే పర్యావరణాన్ని కూడా ముఖ్యమైన విషయాల్లో ఒకటిగా పరిగణించాలన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి రహదారుల మౌలిక సదుపాయాల కల్పన కూడా ఓ పరిష్కారం గా పని చేస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16శాతం వరకు ఉన్నాయని.. 2026 చివరి నాటికి వాటిని సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ– రిపోర్ట్ 2024' నివేదిక ఇటీవల విడుదలైంది. దీని ప్రకారం.. ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారత్‌లోనే ఉన్నాయి. అస్సాంలోని బైర్నీహాట్ నగరం తొలిస్థానంలో నిలవగా.. తరువాతి స్థానాల్లో ఢిల్లీ, ఇతర నగరాలు ఉ న్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా ఢిల్లీ తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఈ కాలుష్యం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం దాదాపు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు అంచనా వేసింది. 2009 నుంచి 2019 వరకు భారత్‌లో ప్రతి ఏడాది కాలుష్య సంబంధిత వ్యాధుల వల్ల దాదాపు 1.5 మిలియన్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు– గతేడాది విడుదలైన లాన్సెట్ ఎ÷–లానెటరీ హెల్త్ అధ్యయనం పేర్కొంది. దీని ఆధారంగా గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ఆధారపడాల్సి ఉందన్నారు.

## కాంగ్రెస్‌లో కాక రేపిన జానా లేఖ..



హైదరాబాద్, రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ రేపో మాపో అనుకుంటున్న దశలో మరోసారి వాయిదా పడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఉడుము మూతికి తేనె పూసి కొండలు ఎక్కించినట్టుగా.. 4o2 ఫార్మలా మంత్రివర్గ విస్తరణతో ఔత్సాహికులను ఊరడిద్దామనుకున్న అధిష్ఠానానికి ఆశాభంగమే ఎదురైంది. సీనియర్ నేత జానారెడ్డి అధిష్ఠానానికి లేఖ కారణంగానే విస్తరణ ప్రక్రియకు బ్రేకులు పడినట్టు భావిస్తున్నారు. ఆ లేఖలో ఏం రాశారో కచ్చితంగా బయటకు రాలేదుగానీ, దాని ప్రభావం మాత్రం గట్టిగానే కనిపిస్తున్నది. కసరత్తు లేకుండా కూర్పు జరిగితే ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడటం ఖాయమని ఆయన హెచ్చరించి ఉంటారని గాంధీభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### వేర్వేరుగా జాబితాలు

మంత్రివర్గంలో ఆరు స్థానాలు ఖాళీ ఉండగా దాదాపు 30మంది ఔత్సాహికులు పోటీపడుతున్న విషయం తెలిసిందే. అధిష్ఠానం దూత మీనాక్షి నటరాజన్ తెలంగాణకు వచ్చి దాదాపు 20రోజులు ఇక్కడే మకాం వేసి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆమె నుంచి అందిన సిగ్నల్ మేరకే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో కూర్పుపై చర్చించి వచ్చారు. ఈ నలుగురిలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు కలిసి ఒక జాబితా, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా చెరో జాబితా కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇచ్చినట్టు తెలిసింది.

### జానారెడ్డి లేఖలో ఏముందో..

నల్లగొండ జిల్లా నుంచి ఒక్క రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వటం వలన ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావుకు, వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డికి, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డికి చెక్ పెట్టినట్టు అవుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇది నూటికి నూరుపాళ్లు ముఖ్యనేత రాజకీయ వ్యూహమేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పార్టీ సీనియర్ నేత జానారెడ్డి రాసిన లేఖ ఆ పార్టీలో కాకరేపుతున్నది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు అసలు మంత్రివర్గంలో ప్రాధాన్యం లేకుండా పోయిందని, ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలో ప్రధానమని ఆయన లాజికల్ పాయింట్ లేవనెత్తారట. కానీ ఈ ఒక్క పాయింట్‌తోనే పార్టీలో ఇంత వేడి పుడుతున్నదంటే కాంగ్రెస్ నేతలు ఎవరూ నమ్మటం లేదు. కొత్త మంత్రులను ప్రమాణ స్వీకారానికి పిలుద్దామని డేట్ ఫిక్స్ చేసుకున్న అధిష్ఠానం జానారెడ్డి ఇచ్చిన షాక్‌తో.. విస్తరణకు బ్రేక్ వేసిందంటే లేఖలో ఇంకేదో ప్రస్తావించి ఉంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి.

### ఒక్క గొడుగు కిందికి అసంతృప్తవాదులు

మంత్రి పదవులకు ఆశపడి గోడ దూకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎవరూ పట్టించుకోలేదని, వారి చేత రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లకుండా ఉండటమే వారికి లభించే గొప్ప పదవి అన్నట్టు పరిస్థితి ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అసంతృప్తివాదులు అంతా ఒక్క చోట కలిస్తే 20 మంది అవుతున్నారని ఢిల్లీ కాంగ్రెస్‌కు నివేదికలు అందినట్టు తెలిసింది. దీనితోపాటు దక్షిణ తెలంగాణకు చెందిన కీలక నేత ఒకరు పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఆయనకు అత్యంత ఆప్తునిగా గుర్తింపు ఉన్న ఓ మంత్రిని కూడా తొలగిస్తారనే ప్రచారం నేపథ్యంలో ఆయన ఈ అందరిని ఒక చోటకు తీసుకువచ్చే అవకాశం ఉందని సొంత నిఘా వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది. మరోవైపు సుదర్శన్‌రెడ్డి పేరు తెరమీదకు రావటంతో నర్సంపేట ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత దొంతి మాధవరెడ్డి ఢిల్లీ వెళ్లారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. ఇంకోవైపు తన భార్యకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఊరుకునేది లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మెట్టు దిగకుండా గట్టి పట్టుదలతో ఉ న్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణను వాయిదా వేయడమే మేలు అని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం.'మంత్రివర్గంలో నాకు చోటు లేకుంటే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్టే. ఆదివాసీలకు, పార్టీ కార్యకర్తలకు ఊపిరిగా నిలిచిన నాకే అన్యాయం చేస్తారా? పదేండ్లు పార్టీని కాపాడుకుంటే ఇదేనా మాకిచ్చే గౌరవం. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు కావాలా? అలా ఇస్తానంటే కుదరదు.

– మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

'మంత్రి పదవి రాకుండా సీనియర్ నేత జానారెడ్డి అడ్డం పడుతున్నారు. ధర్మరాజులా ఉండాల్సిన వ్యక్తి.. ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారు. 30 ఏండ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలనే విషయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? మంత్రి పదవి అడుకుంటే వచ్చేది కాదు..కెపాసిటీతో వస్తుంది'– మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

'నేను బీజేపీలో ఉండి ఉంటే కేంద్రమంత్రిని అయ్యేవాన్ని. రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాం. గడ్డం కుటుం బం పోటీ చేయడం వల్లనే ఈ ప్రాంతంలో (ఆదిలాబాద్ జిల్లాలో) కాంగ్రెస్ గెలిచింది'.– చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

## బెదిరింపులకు పాల్పడేవారిని వదిలిపెట్టేదే లేదు..




కామారెడ్డి : ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం.. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో కవిత పాల్గొని ప్రసంగించారు.బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ అని ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు.మాట తప్పడం%ొ% మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలి అని కవిత విమర్శించారు.ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి. తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది బీఆర్ఎస్ పార్టీ. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఒకైక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉ ద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు అది కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయు తంగా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారు. కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్‌ది. ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుంది అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం. కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం. సాగు నీళ్ల పన్ను మాఫీ చేసిన వ్యక్తి కేసీఆర్. రైతు బంధు, రైతు బీమా వంటి అనేక కార్యక్రమాలను కేసీఆర్ చేపట్టారు. చివరి గింజ వరకు వడ్లు కొని కేసీఆర్ చరిత్ర సృష్టించారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

## ప్రవీణ్ పగడాల కేసుపై హర్షకుమార్ సంచలన వ్యాఖ్యలు..



అమరావతి, పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసు వివాదంగా మారింది.. క్రైస్తవ సంఘాల ఆందోళనలతో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చివరకు ప్రవీణ్ పగడాలది రోడ్డు ప్రమాదమేనని క్లారిటీ ఇచ్చారు..దానికి సంబంధించి కొన్ని సీసీ ఫుటేజ్‌లు కూడా బయటపెడుతూ.. వివరించారు.. అయితే, ప్రవీణ్ పగడాల కేసులో సంచలన వ్యాఖ్యలు చేవారు. మాజీ ఎంపీ హర్ష కుమార్.. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసు దర్యాప్తును నేను నమ్మడం లేదన్నారు.. రోడ్డు ప్రమాదం కాదు కచ్చితంగా హత్యే నంటూ హాట్ కామెంట్లు చేశారు.. ఆర్ఎస్ఎస్, హిందూ మతోన్మాదులు పాస్టర్ ప్రవీణ్ ను హత్య చేశారని నా అనుమానం అన్నారు.ఇక, మత మార్పిడి నిషేధ చట్టానికి వ్యతిరేకంగా పాస్టర్ ప్రవీణ్.. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు.. రేపు సుప్రీంకోర్టులో ప్రవీణ్ పగడాల తన వాదనలు వినిపించాల్సిన ఉంది.. ఇదే కేసులో బీజేపీ అధికార ప్రతినిధి అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ వాదిస్తున్నారు.. ఆర్ఎస్ఎస్ అగ్రనేతలు, అశోక్ కుమార్ ఉపాధ్యాయ కలిసి హత్య చేయించారని నా అనుమానం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు హర్షకుమార్.. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండడంవల్లే ప్రవీణ్ ల్యాప్ టాప్ ను పోలీసులు తీసుకెళ్లారు.. ఆ రోజు విజయవాడ సమీపంలోని తెంపెల్లి వద్ద సువార్త సభలకు పాస్టర్ ప్రవీణ్ వెళ్లారని తెలిపారు.. సభకు వెళ్లిన సీసీ ఫుటేజ్ ను పోలీసులు ఎందుకు సంపాదించలేదు? అని నిలదీశారు.. పాస్టర్ ప్రవీణ్ ను హైదరాబాద్ శివారులోని యూపీ గ్యాంగ్ లు హత్య చేశారనే అనుమానం ఉందన్నారు.. నేను వ్యక్తం చేస్తున్న అనుమానాలకు నా వద్ద ఎలాంటి ఆధారాలు లేవు.. కానీ, నా అనుమానాలపై దర్యాప్తు చేయాల్సిన బాధ్యత పోలీసులదే అంటున్నారు హర్షకుమార్.ఇంకా చాలా మంది పాస్టర్ లను హత్య చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి, సెక్యులర్ వాదులు అంత ఏకం కావాలి అని పిలుపునిచ్చారు హర్షకుమార్.. ఈస్టర్ పండుగ సందర్భంగా ఈ నెల 19 సాయంత్రం రాజమండ్రిలో ప్రవీణ్ పగడాల మృతి చెందిన ప్రాంతం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తాం.. నేను న్యాయం వైపు మాట్లాడే వాడిని అన్నారు మాజీ ఎంపీ హర్ష కుమార్..

## నిర్దోషి అయితే కాకాణి ఎందుకు పారిపోయినట్లు?



నెల్లూరు,ఏప్రిల్15: మాజీ మంత్రి కాకణి గోవర్ధన్ రెడ్డి మోసాలకు వ్యతిరేకంగా పోరాడిన తనపై అక్రమ కేసులు పెట్టించారని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. తాను నిర్ధోషినని చెప్పుకునే కాకణి నెల్లూరు నుంచి ఎందుకు పారిపోయారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. కరోనా ఆనందయ్య మందు కేసులో మంగళవారం నెల్లూరు రైల్వే కోర్టుకు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరయ్యారు. నర్మదా రెడ్డి ఆనందయ్య మందును ఆన్‌లైన్లో అమ్మకాలు పెట్టారని చెప్పారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాకణి లాంటి పనికిమాలిన వ్యక్తులను మంత్రులుగా, జిల్లా అధ్యక్షుడిగా జగన్ చేశారని మండిపడ్డారు. వైఎస్ భారతి గురించి మాట్లాడిన టీడీపీ నాయకులను పార్టీ నుంచి తీసేసిన నేత చంద్రబాబు అని చెప్పారు. వల్లభనేని వంశీ, కాకణి లాంటి నేతలు ఇళ్లల్లో ఆడవాళ్లను తిడితే జగన్ అసెంబ్లీలో నవ్వుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెహుల్ చౌక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసగాడు, బాంబు బ్లాస్టింగ్ కేసులో ఉన్నా వారిని సైతం పోలీసులు పట్టుకున్నారని.. కానీ కాకణి మాత్రం పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారంటే అంతకుమించిన ఘనుడు కాకణి అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కాకణి తన మీద 17 కేసులు పెట్టించారని అన్నారు. తాను కాకణిపై చేస్తున్న విమర్శలకు తనను, తన తల్లిదండ్రులను సైతం అసభ్యంగా తిట్టారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనను కాకాని తిట్టించిన వైసిపీ మాజీ ఎమ్మెల్యే భాషా, ఎమ్మెల్సీలను ఇలానే తిట్టిస్తాను బరిస్తారా అని ప్రశ్నించారు. పట్టపగలు అనుమతులు లేకుండా క్వాడ్జిని కాకణి దోచుకున్నారని ఆరోపించారు. రౌడీలు, హిజ్రాలను పంపి తనను బద్నామ్ చేయాలని చూశారని అన్నారు. అలాంటి వ్యక్తిని జిల్లా అధ్యక్షుడిగా పెట్టిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచించాలని అన్నారు. తప్పుచేసిన కాకణి పోలీసులకు దొరకకుండా పారిపోయి తిరుగుతున్నారని ఆరోపించారు. మీడియా ముందు మాట్లాడే వైసీపీ నేతలు.. కాకణి తప్పు చేయకపోతే పోలీసులకు అప్పగించాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ విసిరారు. కాకణి చేసిన పాపాలకు తానే అనుభవిస్తున్నాడని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. తన మీద కాకణి తప్పుడు కేసులు పెడితే పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు సహకరించానని తెలిపారు. కాకాణి, వంశీ వంటి నేతలను జగన్ అదుపు చేయలేదని.. అందుకే వైసీపీ 11 సీట్లకు మాత్రమే పరిమితమైందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. 61వేల టన్నుల క్వార్ట్జ్ అక్రమంగా తవ్వేశారని 2003లోనే మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేశారని.. అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదన్నారు. నేదురుమల్లి, ఆనం బ్రదర్స్‌తో తాను ధీటు–గా పోరాడానని గుర్తుచేశారు. ఎన్నడూ లేని విధంగా కాకాణి తనపై 17 అక్రమ కేసులు పెట్టించారని మండిపడ్డారు. తాను ధీటు–గా ఎదుర్కొన్నానని..కాకాణిలా పారిపోలేదని.. పోలీసులకు సహకరించానని తెలిపారు. వైసీపీ నేతలు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వరంగల్ సభ తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది...



యాదాద్రి భువనగిరి : బీఆర్ఎస్ వరంగల్ సభ తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. రజతోత్సవ సభ విజయవంతం కోసం యాదాద్రి జిల్లా వలిగొండ మండలంలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదాద్రి ఆలయం వరకు బీఆర్ఎస్వీ విద్యార్థులు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. వరంగల్ సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుంది. సబ్బండ వర్గాలు కదిలివస్తున్నాయ్. వరంగల్ సభ ఓ రేంజ్‌లో ఉంటుంది. బీఆర్ఎస్ ఏది చేసినా సంచలనమే. వరంగల్ సభ కూడా అలానే ఉంటుంది. ఇవ్వాళ అందరిలో చైత్యనాన్ని స్ఫూర్తిని నింపేలా బీఆర్ఎస్వీ విద్యార్థులు పాదయాత్ర చేపట్టారు. ఇవ్వాళ ప్రజలకు కష్టం వస్తే మా కేసీఆర్ ఉంటే బాగుండు అని అంటున్నారు. కేసీఆర్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారు. ప్రతి రైతు మనసులో కేసీఆర్ వున్నారు అని జగదీశ్ రెడ్డి తెలిపారు.గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కనబడితే తన్ని తరిమేసే రోజులు వచ్చాయి. ఎక్కడికక్కడ ప్రజలను పీక్కొని తింటూ కాంగ్రెస్ నాయకులు బలిచారు. మంత్రులు అయితే కమిషన్లు తింటున్నారు. ప్రజల సొమ్మును, ప్రభుత్వం సొమ్మును దోచుకొని తింటున్నారు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు గొంగిడి మహేందర్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

బుధవారం 16-04-2025

# ధాన్యం సేకరణలో అస్పష్ట విధానం !

ధాన్యం కావచ్చు...పండించిన పంటలు ఏవైనా కావచ్చు...ఏటా రైతులకు తిప్పలు తప్పడం లేదు. పాలకులు మాటలే తప్ప క్షేత్రస్థాయిలో పథకాలు అమలు కావడం లేదు. కనీస మద్దతు ధరలు ప్రకటించినా వాటిని అమలు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. తాలు పేరుతో, దడవాయి పేరుతో దోచేస్తున్నారు. పంటలకు సకాలంలో రుణాలు అందడం లేదు. బ్యాంకులు కూడా పైకి చెప్పినంతగా ఉదారంగా ఉండడం లేదు. పంటరుణాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచే తెచ్చుకోవాల్సి వస్తోంది. దళారులు కొన్న తరవాతే ప్రభుత్వం అధికారులు రంగప్రవేశం చేస్తారు. పంటల కోసం తెచ్చిన పెట్టుబడి అప్పులు తీర్చే తొందరలో ధాన్యాన్ని, పంటలను వచ్చిన రేటుకు, అంటే దళారుల రేటుకు అమ్ముకోక తప్పడం లేదు. ఇదంతా క్షేత్రస్తాయిలో అధికారులకు తెలుసు. మార్కెట్ కమిటీలు పెట్టినా,సహకారసంఘాలు ఉన్నా.. ధాన్యం చేతికొచ్చే సమయానికి తిప్పలు పడక తప్పడం లేదు. పంట ఏదైనా ఇదే దుస్థితి ఉంది. కొనుగోళ్ల విషయంలో ఆందోళనలు రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా ఉందే తప్ప రైతులను ఆదుకునే విధానంలా ఉండడం లేదు. ఇందులో అన్ని పార్టీలు ఎవరికివారు తమవంతు రాజకీయ లాభం కోరే పాత్ర పోషిస్తూ రక్తి కట్టిస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది. జానికి కేంద్రం తీరు కూడా ఏ మాత్రం సరిగా లేదు.ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. ధాన్యం కొనుగేళ్లే కాదు..అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. రైతులు బతకడానికే కష్టపడుతున్నారు. మనలను బతికించడానికి వారు వ్యవసాయం చేస్తున్నారు. కేంద్రం పెట్రో, డీజిల్,గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెంచుతూ పోతున్నది. సామాన్యులు నానాయాతనలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అలాగే ధాన్యం ధరలను ఏటేటా పెంచడం లేదు. ఎవరికి వారు ధాన్యం ధరలు ని÷-ణయించుకునే పరిస్థితి లేదు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యవసాయ దిగుముతలను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని ఆపేయాలి. దేశీయంగా పంటలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల ఎలాంటి వివక్ష చూపడం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ధాన్యం కొనుగోళ్లు మాత్రం సజావుగా సాడం లేదు. ఇప్పుడు వడగళ్ల వానల కాలం. ధాన్యం కల్లాల్లోకి చేరకముందే తడిసి ముద్దవుతోంది. కల్లాల్లో కొన్నిసార్లు తడిసి కొట్టుకు పోతోంది. ఇదంతా దైవాధీనంగా రైతుల పరిస్థితి ఉంది. మార్కెట్లో పత్తి, మిర్చి, వరి తదితర పంటలు వచ్చినా..ట్రాక్టర్లు బారులు తీరినా సక్రమంగా అమ్ముకుని ఇంటికి చేరుతామన్న ధైర్యం రైతుల్లో ఏ రోజూ కనిపించడం లేదు. పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపినా ..ఏటేటా మాత్రం ధాన్యం అమ్మకాల వ్యవహారం ప్రహసనంగా మారుతోంది. తెలంగాణలో డీసెంట్రలైజ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం (డీసీపీ)లో బియ్యం సేకరిస్తున్నామని.. పంజాబ్ నుంచి నాన్ డీసీపీ విధానంలో సెంట్రల్ పూల్ ద్వారా బియ్యం సేకరించి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటిదాకా ఒకే విధానం అమల్లో ఉందని కేంద్ర అధికారులు చెప్పారు. తెలంగాణ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐకి అప్పగిస్తోందని గుర్తు చేశారు. తెలంగాణతోపాటు దక్షిణ భారతదేశం నుంచి ఎఫ్‌సీఐ సేకరించే బాయిల్డ్ రైస్‌ను సెంట్రల్ పూల్ కింద కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు పంపిస్తామని అధికారులు తెలిపారు. తెలంగాణ కూడా పశ్చిమ బెంగాల్, బిహార్‌లకు బాయిల్డ్ రైస్‌ను పంపుతుంది. తెలంగాణలో బాయిల్డ్ రైస్ వినియోగం లేనందున మొత్తం బియ్యాన్ని ఎఫ్‌సీఐకే పంపిస్తూ వస్తోంది. దేశంలో బాయిల్డ్ రైస్ బియ్యానికి డిమాండ్ లేకుండా పోయింది. అంతుకే రా రైస్ మాత్రమే సేకరిస్తున్నారు. నిజంగానే జాతీయ విధానం రావాలంటే అందుకు ప్రత్యామ్నాయంగా ఆయా రాష్ట్రాలను కలుపుకుని పోరాడాలి. అందుకే వరి,మిర్చి తదితరు పంటల కొనుగోళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏటా విమర్శల పర్వం కొనసాగుతూనే ఉంది. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరి తీసుకొని.. రైతులకు భరోసా కల్పించాలి. దీనిని కడవరకు ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే. పడించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావాలి. అసలే వడగళ్ల సీజన్‌లో ధాన్యం తడిసినా, చేలో నష్టపోయినా తక్షణం పరిహారం అందాలి. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారితోనే చర్చించాలి. వారే తమ సమస్యలను వివరించగలరు. పాలకులు ఇన్నేళ్లయినా రైతుల సమస్యలపై అవగాహన కలిగి ఉండడం లేదు. ఈ విధానం పోవాలి. కేంద్ర,రాష్ట్రాలు కలసి పంటల కొనుగోళ్లపై సమగ్రంగా చర్చించాలి. రైతులకు ఏది చేస్తే లాభమో దానిని అనుసరించాలి. దానినే ఖరారు చేయాలి. అప్పుడే మార్పులు రాగలవు.

# రాహుల్ వ్యూహం ! బలం, బలగంపైనే ఫోకస్?



న్యూఢిల్లీ,దేశ చరిత్రలో దాదాపు 58ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రస్తుతం కష్టకాలం ఎదుర్కొంటోంది. బీజేపీ హవాతో పదిహేనేళ్లుగా అధికార పీఠానికి దూరమైంది. ఇందులో వరుసగా మరో నాలుగేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ తన బలాన్ని, బలగాన్ని పెంచుకోవాలని తహతహలాడుతోంది. ఇందుకు ఏం చేయాలి? తప్పుల్ని ఎలా సరిచేసుకోవాలి? ప్రధాన ప్రత్యర్థి రాజకీయ పార్టీని ఎలా ఎదుర్కోవాలి? ఇప్పుడివే ఆ పార్టీ నేతల ముందున్న ప్రధాన సవాళు.. గతేడాది మహారాష్ట్ర, జార?ండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని కాంగ్రెస్ మూటగట్టుకుంది. వచ్చే ఏడాది బీహార్ ఎన్నికల్లో బోణి చేసి.. 2026లో నాలుగు రాష్ట్రాలను చేజిక్కించుకోవాలని ప్లాన్ చేస్తోంది.. వాటిలో రెండు దక్షిణాది రాష్ట్రాలు, మరో రెండు కీలక పశ్చిమ బెంగాల్, అసోంల్లో బీజేపీని దెబ్బ తీయాలనే ఆలోచన చేస్తోంది.2027లో బీజేపీ అధికారంలోని యూపీ, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో పాగా వేయాల్సిందే. 2028లోనూ బీజేపీ చేతిలోని మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, రాజస్థాన్‌లో గెలిస్తే.. ఇక 2029లో ఏపీ, ఒడిశాలో ఉనికిని కాపాడుకోవాలి. ఇదే జరిగితే వచ్చే పార్లమెంటులో ఇండియా కూటమి అధికారం గ్యారెంటీ. ఇదీ జాతీయ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. ఇందుకు ఏం చేయాలనే వ్యూహాన్ని ఆ పార్టీ నేతలు రచిస్తున్నారు. తొలుత గుజరాత్‌ను బలహీన పర్చడంపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. దీనికి గాను నాయకత్వ వికేంద్రీకరణే శరణ్యం అనేది ఆ పార్టీ హైకమాండ్ భావన. ఈ మధ్య గుజరాత్ కేంద్రంగా జరిగిన మేధోమథనం సారాంశం కూడా ఇదే. రోజు రోజుకూ దేశమంతా కమలమయం అవుతున్న వేళ.. కాంగ్రెస్ ఆ హవాని అడ్డుకుంటుందా? లేదా.. ఆ పార్టీ వ్యూహం ఏంటన్నది పరిశీలిద్దాం..మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో చావు దెబ్బ తిన్న కాంగ్రెస్ పార్టీ రాబోయే నాలుగేళ్లల్లో వరుసగా.. 13రాష్ట్రాల్లో తన బలం, బలగాన్ని పెంచుకోవాలి. లేని పక్షంలో దేశ రాజకీయాల్లోనే కాంగ్రెస్ ఉనికి కనుమరుగు కాక తప్పదు. ఈ ఏడాది 2025 ఆఖరులో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది 2026లో అసోం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఇక 2027లో పంజాబ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్ని, 2028లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్ని ఎదుర్కోవాలి. అంతిమంగా 2029లో లోక్‌సభ ఎన్నికలు, ఒడిశా, ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమికి దెబ్బకొడితే.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుంది. ఈ స్థితిలో మోదీషా ద్వయం దూకుడుకు కళ్లెం ఎలా? వేయాలనే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం జరిపిన మేథోమథనంలో.. కొన్ని కీలకాంశాలు దేశ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇక.. రాహుల్ కీలక వ్యూహం ఏంటన్నది కూడా ఈ సదస్సులో చర్చించి, అమలు చేయబోతున్నట్టు స్పష్టమవుతోంది.

గుజరాత్ పీఠమే టార్గెట్

అందుకే 64 ఏళ్ల పాటు.. కనీసం పట్టించుకోని గుజరాత్ రాష్ట్రంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి కేంద్రీకరించింది. జాతీయోద్యమంలో కాంగ్రెస్ పార్టీ దేశభక్తిని గుర్తు చేసుకుంది. ఇక గుజరాత్‌లో బీజేపీ ఓటమే టార్గెట్‌గా మంత్రాంగానికి సిద్ధపడింది. గుజరాత్ పీఠం కైవసమే ప్రధాన లక్ష్యంతో ఢిల్లీ పీఠాన్ని హస్తగతం చేసుకోవాలనే వ్యూహాత్మకంగా అడుగులు ప్రారంభించింది. తదనుగుణంగానే గుజరాత్ వేదికగా సీడబ్ల్యూసీ, ఏఐసీసీ విస్తృత స్థాయి భేటీలో అగ్రనేతలంతా కలిసి రోడ్ మ్యాప్ రెడీ చేశారు. నిజానికి గుజరాత్‌లో గత ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అధికారం చిక్కటం లేదు. ఒక రకంగా బీజేపీకి గుజరాత్ పెట్టని కంచుకోటగా మారింది. ఇలాంటి స్థితిలో.. ప్రధాని మోడీ సొంతగడ్డ గుజరాత్ వేదికగా భారత జాతీయ కాంగ్రెస్ సీడబ్ల్యూసీ, ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులతో సహా 169 మంది పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకుల్లో కీలక సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వాన్ని బీజేపీ కైవసం చేసుకుందని, మహాత్మా గాంధీ, పటేల్, నెహ్రూలకు అసలు వారసులం తామేనంటూ కాంగ్రెస్ నేతలు స్వరం విప్పారు. ఇక గుజరాత్ లో పుట్టిన మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభ భాయ్ పటేల్.. అసలు సిసలు కాంగ్రెస్ నేతలని.. తమ నేతల్ని రాజ్యాధికారం కోసం బీజేపీ వాడుకుంటోందనే వాదన తెరమీదకు తీసుకువచ్చింది. లోకల్ హీరో పటేల్ వారసత్వం పేరుతో.. గుజరాత్ లో బలం పెంచుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇంతకీ ఈ లోకల్ అస్త్రం ఎంతమేరకు పని చేస్తుందో..గానీ.. ఇక సంస్థాగత ప్రక్షాళనపై జరిగిన చర్చ.. తీసుకున్న తీర్మానాలు .. దేశంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్ని కదిలించాయి. ఉత్సాహాన్ని ఊరించాయి.

ఇక ప్రక్షాళనే కాంగ్రెస్ ధ్యేయం

మితిమీరిన ప్రజాస్వామ్యం పైకి కనిపిస్తున్నా%ె% ఏక కుటుంబ ఆరాధన.. ఏక నాయకత్వం నియంతృత్వం, గుత్తాధిపత్యం. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విధ్వంసానికి ప్రధాన కారణాలు కాగా.. క్షేత్ర స్థాయిలో జన బలం లేని వ్యక్తులకు రథసారథి పగ్గాలు అప్పగించటం.. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం డొంక తిరుగుడు వ్యవహారంతో కిందిస్థాయిలో జెండా మోసే కార్యకర్త అదృశ్యమయ్యాడు. ఈ స్థితిలో పార్టీ ప్రక్షాళన అత్యవసరం అనే నిజాన్ని కాంగ్రెస్ పెద్దలు.. అధినాయకులు గుర్తించారు. ఇక పార్టీలో వికేంద్రీకరణకు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పూర్తి మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి కార్యవర్గ నియామకం, తొలగింపులపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర స్థాయి నాయకుల వ్యవహార శైలికి ఇక కళ్లెం వేస్తూ జిల్లా అధ్యక్షులకు పూర్తి అధికారాలను దాఖలు చేయాలని నిర్ణయం తీసుకున్నార. అభ్యర్థుల ఎంపికలోనూ కచ్చితమైన దిశానిర్దేశాలు జరిగాయి. ఇక నుంచి, కేంద్ర నాయకత్వం, జిల్లా అధ్యక్షుల మధ్య ప్రత్యక్ష, క్రమబద్ధ సత్సంబంధాలను నెలకొల్లే ఒక కొత్త యంత్రాంగం కూడా ఏర్పాటు చేసారు. జిల్లా అధ్యక్షులు ఒక నిర్దిష్ట కాలం పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలనే నిర్ణయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

సంస్థాగతంగా పునరుద్ధరించుకునేందుకు..

2025 ను సంస్థాగత పునరుద్ధరణ సంవత్సరంగా కాంగ్రెస్ పార్టీ గుర్తించింది. జిల్లా కాంగ్రెస్ కమిటీలను సంస్థాగత కేంద్రంగా ఎలా మార్చాలనే దానిపై ఈ వేదిక కీలకంలో చర్చించినట్లు తెలుస్తోంది. రణదీప్ సుర్జేవాలా నేతృత్వంలోని 15 మంది సభ్యుల ముసాయిదా కమిటీ ఈ తీర్మానాలను ఖరారు చేశాయి. పార్టీని ప్రక్షాళన చేయడానికి నాయకులంతా సిద్ధమయ్యారు. ఈ భేటీకి ముందే ఢిల్లీలో మూడు బ్యాచ్‌లుగా 862 జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన ఈ సమావేశంలో నేతలకు భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత ఇచ్చారు అగ్రనేతలు. ఇందులో సైద్ధాంతిక శిక్షణ, సోషల్ ఇంజనీరింగ్, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కోవడం, పార్టీ అనుకూల కథనాన్ని రూపొందించడం.. ఎన్నికలు, నిధులు, మీడియా, సోషల్ మీడియా, పార్టీ ఆస్తులు, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా చర్చించారు. ఇప్పటికే, కేంద్ర నాయకత్వం ఢిల్లీలో మూడు బ్యాచ్‌లుగా 862 జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించింది.

నిర్మాణాత్మకంపైనే దృష్టి..

ఇప్పటి వరకూ దళిత, ముస్లిం, బ్రాహ్మణ ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ కొట్టుమిట్టాడుతోంది. ఇక ఓబీసీ ఓటర్లు దూరం అయ్యారు. ఉత్తరప్రదేశ్ ఒక ఉదాహరణ, 1991 నుంచి యూపీలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉంది.. అక్కడ, కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మాత్రమే మద్దతిస్తోందని బీజేపీ ప్రచారం చేస్తోంది. గుజరాత్ లోనూ అదే స్థితి. ఇక పార్టీ నిర్మాణంలో క్షేత్రస్థాయిపైనే అగ్రనాయకత్వం దృష్టి సారించాలని.. తొలుత గుజరాత్ నుంచే ఈ క్రతువును ఆరంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాలు అమలు జరిగితే.. ఫలితాలు ఎలా ఉంటాయో తెలియాలంటే.. 2027 వరకూ ఎదురు చూడక తప్పదు.

# ఎందుకంత ప్రేమ? ఇద్దరేనా.. ఇంకా ఉన్నారా?



హైదరాబాద్, కేబినెట్ విస్తరణ తెలంగాణ కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. మంత్రి పదవులపై లుకలుకలు మొదలయ్యాయి. మాకంటే మాకంటూ కేబినెట్ బెర్త్ కోసం కర్చీఫ్ వేస్తున్నారు ప్రముఖులంతా. ఉగాదికే జాబితా వస్తుందనుకుంటే.. అది కాస్తా ఆలస్యం అవుతుండటంతో రచ్చ రాజుకుంటోంది. ఆ ఉక్కబోత భరించలేక ఆశావహులు ఒక్కొక్కరిగా నోరు జారుతున్నారు. బహిరంగంగానే బయటపడుతున్నారు. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మాజీ మంత్రి జానారెడ్డిని టార్గెట్ చేయగా.. లేటెస్ట్‌గా ప్రేమ్ సాగర్ రావు.. ఓ కుటుంబాన్ని కార్నర్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌లో కలకలం రేపారు.

ప్రేమ్ సాగర్ టార్గెట్ ఎవరు?

మంత్రి పదవిని అడ్డుకుంటూ.. తన గొంతు కోసేందుకు ఓ కుటుంబం ప్రయత్నిస్తోందంటూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గొంతు కోస్తే ఊరుకోబోనని.. కుటిల యత్నాలను తిప్పికొడతానని హెచ్చరించారు. పార్టీని కష్టకాలంలో కాపాడిన వారికి అవకాశాలు కల్పించాలని.. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేయవద్దన్నారు. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ప్రేమ్ సాగర్ రావు టార్గెట్ చేసింది ఎవరిననే చర్చ జరుగుతోంది తెలంగాణలో.

రావు గారి మాటలకు అర్థాలే వేరులే!

రాజగోపాల్‌రెడ్డి గురించే ప్రేమ్‌సాగర్ అలా అన్నారని కొందరు అంటున్నా.. అది కరెక్ట్ కాదని తెలుస్తోంది. ఆయన మాట్లాడింది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల గురించేనని చెబుతున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామినే తన మంత్రి పదవికి చెక్ పెడుతున్నారనేది ప్రేమ్ సాగర్ వ్యాఖ్యల అంతరార్థం అంటున్నారు. వివేక్‌తో పాటు కుటుంబంలో ఆయన సోదరుడు వినోద్ కూడా ఎమ్మెల్యేగా ఉన్నారు. కొడుకు వంశీ.. ఎంపీగా కొనసాగుతున్నారు. వివేక్ గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత బీజేపీకి మారారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు. అందుకే ఆయన్ను టార్గెట్ చేస్తూ.. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కామెంట్స్ చేశారు. ఉమ్మడి జిల్లా కోటాలో కేబినెట్ రేసులో ప్రేమ్ సాగర్‌కు వివేక్ నుంచి పోటీ ఉంది. ఆ ఫ్యామిలీ గుత్తాధిపత్యం కోసమే.. తన కేబినెట్ బెర్త్ కన్ఫామ్ కాకుండా అడ్డుకుంటున్నారనేది ప్రేమ్ సాగర్ రావు అక్కసుగా తెలుస్తోంది.

ఆలస్యం చేస్తే ఇట్టానే ఉంటాదా?

పెద్దలు జానారెడ్డిని రాజగోపాల్‌రెడ్డి టార్గెట్ చేసిన మరుసటి రోజే ప్రేమ్ సాగర్ రావు సైతం బహిరంగ ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీలో కాస్త కుదుపు వచ్చినట్టైంది. కేబినెట్ విస్తరణ లేట్ అవుతున్నా కొద్దీ.. ఇలాంటి పరిస్థితులే తలెత్తుతాయని.. అందుకే వీలైనంత తొందరగా ఆ పని పూర్తి చేయాలని అధిష్టానానికి మెసేజ్‌లు వెళ్తున్నాయట. నల్గొండలో రాజగోపాల్‌రెడ్డి బలమైన నాయకుడు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్ సాగర్ రావు తిరుగులేని నేత. వారికి మంత్రి పదవులు ఇవ్వడంపై పార్టీ పెద్దలెవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. జానారెడ్డి ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన కుమారుడు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ఈయన్ను అడ్డుకోవడం అనేది టీ కప్పులో తుఫాను లాంటి వివాదమే తప్ప అంత పెద్దగా చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు.

ఇద్దరేనా? ఇంకా ఉన్నారా?

ఆదిలాబాద్‌లో మాత్రం ప్రాబ్లమ్ కాస్త సీరియస్ గానే ఉన్నట్టుంది. ప్రేమ్ సాగర్ రావు ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆయన్ను సంతృప్తి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఏదైనా అసంతృప్తి ఉంటే పార్టీ అంతర్గత వేదికల్లో పంచుకోవాలి కానీ.. ఇలా బహిరంగా మాట్లాడి.. అధిష్టానాన్ని బ్లాక్ మెయిల్ చేయడం కరెక్ట్ కాకపోవచ్చని చెబుతున్నారు. ఇప్పటికైతే ఇద్దరు. మరో రెబల్ వాయిస్ వినిపించకూడదంటే.. సాధ్యమైనంత త్వరగా ఆ కేబినెట్ విస్తరణ అనేది ఏదైతో ఉందో.. దాన్ని కంప్లీట్ చేస్తే సరి. లేదంటే ఇలానే ఉంటుంది మరి.

## రౌడీషీటర్ దారుణ హత్య

హైదరాబాద్,హైదరాబాద్ పాతబస్తీలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతడిని నడిరోడ్డుపై కత్తులతో పొడిచి హత్యచేశారు. ఫలక్‌నుమా రౌడీ షీటర్ మసీయుద్దీన్‌ను గుర్తు తెలియని వ్యక్తి హత్యచేశారు.

# గర్భిణి గొంతు నులిమి హత్యచేసిన భర్త

విశాఖపట్టణం, విశాఖనగరంలోని మధురవాడలో దారుణం చోటు చేసుకుంది. నిడు గర్భణజ భరత్ చేతిలో హత్యకు గురయ్యింది. స్థానిక ఆర్టీసీ కాలనీలో నిండు గర్భిణి హత్యకు గురయ్యారు. పీఎంపాలెం పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీలోని ఓ ఆపార్ట్‌మెంట్‌లో జ్ఞానేశ్వర్, అతడి భార్య అనూష (27) నివసిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణి. ఏదో విషయంలో సోమవారం ఉదయం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో జ్ఞానేశ్వర్.. ఆమె గొంతు గట్టిగా నొక్కేశాడు. దీంతో ఆమె ఊపిరి అందక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్థానికుల సాయంతో ముందుగా ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు అతడే తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు- వైద్యులు ధ్రువీకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మనస్పర్థలు కారణంగా భార్య అనూషకు భర్త జ్ఞానేశ్వర్ మధ్య గొడవ తలెత్తింది. రెండు ఏళ్ల క్రితం వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. అంతలో ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా.. ఈ అంశంపై తాజాగా ఆమె స్నేహితులు కీలక విషయాలు వెల్లడించారు. రెండేళ్ల క్రితం సింహాచలంలో లవ్ మ్యారేజ్ చేసుకున్నారని చెప్పారు. మృతురాలు అనూష తండ్రి చనిపోయారు, తల్లికి ఆరోగ్యం బాగోలేక మూడేళ్లగా కోమాలో ఉందన్నారు. జ్ఞానేశ్వర్ అతని కుటుంబ సభ్యులకు తెలియకుండా పెళ్లి చేసుకున్నాడు.. భార్యను బయటకు ఎక్కడికి తీసుకువెళ్లినా సరదాగా మెలిగేవాడు కాదు. జంటగా ఫొటోలు దిగుదామన్నా వద్దనేవాడు. గతంలో కూడా పలుమార్లు చంపడానికి ప్రయత్నించాడు.. ఫలుదాలో ఓసారి టాబ్లెట్స్ కలిపి చంపాలి అనుకున్నాడు.. మాకు సమాచారం వచ్చి వెళ్లే చూసే సరికి బెడ్ మీద విగత జీవిగా పడి ఉంది.. ఈ రోజు డెలివరీ ఉందని నిన్న ఫ్రెండ్స్ అందరికీ వీడియో కాల్ చేసింది.. రాత్రికి రాత్రి చున్నీతో గొంతు బిగించి చంపేశాడు. భర్త జ్ఞానేశ్వర్ ముఖంపై గోర్లతో రెక్కేసిన ఆనవాలు ఉన్నాయి.. అని బాధితురాలి స్నేహితులు వెల్లడించారు.

# దేశం కోసం పోరాడిన వారిని విస్మరించిన కాంగ్రెస్

చండీఘడ్,దేశం కోసం పోరాడిన ఎందరినో కాంగ్రెస్ పట్టించుకోలేదని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. కేరళకు చెందిన న్యాయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు చెట్టూర్ శంకరన్ నాయర్‌ను ఉద్దేశించి ఆయన స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ ధైర్యవంతుడైన జాతీయవాది అయిన శంకరన్ నాయర్‌ను పక్కనపెట్టింది. హరియాణా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లోని ప్రతి బిడ్డ శంకరన్ నాయర్ గురించి తెలుసుకోవాలని మోదీ అన్నారు. హస్తం పార్టీ వారసత్వ రాజకీయాల్లోనే నిమగ్నమైపోయిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ కొందరు గొప్ప వ్యక్తులను నిర్లక్ష్యం చేసిందని వారిలో శంకర్ నాయర్ కూడా ఒకరని భాజపా నాయకుడు రాజీవ్ చంద్రశేఖర్ పోస్ట్ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా స్పందన వచ్చింది. 1919 జలియన్ వాలాబాగ్ ఊచకోత తర్వాత వైస్రాయ్ కార్యనిర్వాహక మండలికి నాయర్ రాజీనామా చేశారు. ఇదే అంశంపై ఇదివరకు సినీ నటుడు అక్షయ్ కుమార్ స్పందించారు. రాజకీయ నాయకులు 'కేసరి 2' ని ఉద్దేశించి చేసే కామెంట్స్ గురించి తాను మాట్లాడాలనుకోవడం లేదన్నారు. నేను చరిత్రకారుడిని కాదు. నటుడిని మాత్రమే. ఈ సినిమాపై ఎవరెవరో చెప్పే మాటలు వినాలనుకోవడం లేదు. వేము గొప్ప సినిమాను ప్రజలకు అందించాలనుకుంటున్నాం. అలాగే ఈ చిత్రాన్ని పుస్తకం ఆధారంగా తెరకెక్కించాం. జలియన్ వాలాబాగ్‌పై ఎన్నో కథలు విన్నాం. అన్ని విషయాల గురించి తెలుసుకున్న తర్వాతే దీన్ని రూపొందించాం. మా తాతయ్య ఈ ఊచకోతకు ప్రత్యక్ష సాక్షి. ఆయన చిన్నప్పటినుంచి దీని గురించి నాకు ఎన్నో కథలు చెప్పారు. అందుకే ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. అందుకే ఈ సినిమాలో భాగం కావాలనుకున్నాను అని తెలిపారు. అక్షయ్ ఈ సినిమాలో శంకరన్ నాయర్ పాత్రలో నటించారు. జలియన్ వాలాబాగ్ ఊచకోత తర్వాత బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన న్యాయవాదిగా కనిపించనున్నారు.

# హసీనా వార్నింగ్..

ఢాకా,బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, తాత్కాలిక దేశాధినేత మహ్మద్ యూనస్‌కి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఆయనను విదేశాలతో కలిసి దేశ పతనానికి కుట్ర పన్నిన "స్వార్థపరుడైన రుణగ్రహీత"గా అభివర్ణించారు.విద్యార్థి నిరసనకారుడు అబూ సయీద్‌ను చంపిన దానిపై కూడా ఆమె సందేహాలను లేవనెత్తారు. 8 నిమిషాల వర్చువల్ ప్రసంగంలో ఆమె యూనస్‌పై ధ్వజమెత్తారు. ఆదివారం ఆమె తన మద్దతుదారుల్ని ఉద్దేశించి మాట్లాడారు. బంగ్లాదేశ్ చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం అవామీ లీగ్‌తో ముడిపడి ఉందని, యూనస్ వీటిని తుడిపెట్టాలని అనుకుంటున్నాడని ఆమె ఆరోపించారు.స్వాతంత్ర్య ఉద్యమకారుల జ్ఞాపకార్థం అన్ని జిల్లాల్లో తమ ప్రభుత్వం నిర్మించిన ముక్తి జోద్ధా కాంప్లెక్సులను తగలబెడుతున్నారని, మీరు నిప్పుతో చెలగాటం ఆడుకుంటే, అది మిమ్మల్ని కాల్చేస్తుందని ఆమె హెచ్చరించారు. బంగ్లాదేశ్‌ని నాశనం చేయాలనుకుంటున్న విదేశీ కుట్రదారులతో యూనస్ కలిసిపోయాడని ఆమె ఆరోపించారు. దేశాన్ని నాశనం చేయడానికి విదేశీ నిధుల్ని ఉపయోగిస్తున్నాడని, BNP (బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ) మరియు జమాత్-ఇ-ఇస్లామిలు అవామీ లీగ్ కార్యకర్తల్ని టార్గెట్ చేస్తూ, హత్యలకు తెగబడుతున్నారని అన్నారు.తమ పాలన ముగియడం బంగ్లాదేశ్ పరిశ్రమలకు షాక్‌ని ఇచ్చిందని, వేలాది కర్మాగారాలు మూతపడ్డాయని, అవామీ లీగ్‌తో సంబంధం ఉన్న కర్మాగారాలు కాలిపోయాయని, హోటళ్లు, ఆస్పత్రులు ప్రతీదాన్ని నాశనం చేస్తున్నారని యూనస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. " చట్ట అమలు చేసే సిబ్బందిని బహిరంగంగా హత్య చేస్తే ఈ దేశం ఎలా నడుస్తుంది? యూనస్‌కు ఇది అర్థం కాలేదా? లేదా అతను దేశాన్ని వినాశనానికి నడిపిస్తున్నాడా? ఈ ఫాసిస్ట్ ఉగ్రవాది యూనస్ అధికారం కోసం దాహంతో మన దేశాన్ని నాశనం చేస్తున్నాడు" అని అన్నారు.షేక్ హసీనాను గద్దె దించేందుకు చెలరేగిన అల్లర్లలో విద్యార్థి కార్యకర్త అబూ సయీద్ మరణించిన ఘటనపై ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. సయీద్ మరణంపై పోలీసులు, నిరసనకారులు విరుద్ధమైన వాదనలు చేశారని, దీనిపై హసీనా అనుమానం వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో, ఐక్యరాజ్యసమితి నిజనిర్ధారణ నివేదిక ప్రకారం, సయీద్ పోలీసులు "ఉద్దేశపూర్వకంగా చట్టవిరుద్ధంగా హత్య" చేయబడ్డారని పేర్కొంది. అయితే, పోలీసులు మెటల్ బుల్లెట్స్ వాడలేదని, రబ్బర్ బుల్లెట్స్ వాడారని హసీనా చెప్పారు.ఈ కేసులో ఒక పోలీస్ ఉన్నతాధికారి నిజం చెప్పేందుకు ప్రయత్నిస్తే, అతడిని యూనస్ ప్రభుత్వం పదవి నుంచి తీసేసిందని ఆమె చెప్పారు. సయీద్ మృతదేహాన్ని వెలికితీసి మళ్లీ పోస్ట్‌మార్టం చేయాలని, మేము అతడిని చంపలేదని హసీనా చెప్పారు. కష్టపడి పనిచేసే బంగ్లాదేశీయుల కలల్ని యూనస్ తుడిచిపెట్టారని ఆమె ఆరోపించారు.

## కంచెగచ్చిబౌలి భూముల వివాదం

న్యూఢిల్లీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలి భూములు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతున్న వేళ ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రధాని మోదీ కూడా తాజాగా విమర్శలుచేశారు. ఈ భూములపై ఏప్రిల్ 16వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరుగనుంది. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వ భూమలేనని ఆ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. ఈ భూముల్లోనే సెంట్రల్ యూనివర్సిటీ-, మరికొన్ని ఇనిస్టిట్యూట్‌లు, బస్ స్టాండులు తదితర సౌకర్యాలు ఎన్నో వచ్చాయని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం సోదాహరణంగా వివరించింది. సుమారు 20 ఏళ్లకుపైగా 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉన్నందున అక్కడ చెట్లు- మొలిచి.. అటవీ ప్రాంతంగా మారిందని ఈ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వివాదాస్పదం కావడంతో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి గత రెండు రోజులుగా ఢిల్లీలోనే ఉండి. సీనియర్ న్యాయవాదులతో చర్చించి.. ఈ అఫిడవిట్‌ను సిద్ధం చేశారు. సోమవారం దీనిని సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత జరిగింది. మరోవైపు ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వ ఖజానాలో నిధులు నిండుకొన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలిలోని దాదాపు 400 ఎకరాలను వేలం పాట నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ స్థలంలో జేసీబీల సాయంతో చెట్లను సైతం నరికి వేయించింది. ఈ విషయం తెలిసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- విద్యార్థులు ఆందోళనలు, ధర్నాలకు దిగారు. వీరి ఆందోళన తీవ్ర తరం చేయడంతో.. ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ సైతం వారికి మద్దతు ప్రకటించాయి. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టును హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- విద్యార్థులతో పాటు- ప్రతిపక్షాలు ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించింది. కంచ గచ్చిబౌలిలో చెట్లు- నరకవద్దంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంకోవైపు ఈ భూములపై రేవంత్ రెడ్డి సర్కార్ ఓ లేఖ విడుదల చేసింది. 2003లో ఈ భూములను నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం ఐఎంజీ సంస్థకు విక్రయించిందని తెలిపింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసిందని స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ఈ భూములు ప్రభుత్వానికి కేటాయించడంతో.. అందుకు ప్రతిగా ప్రభుత్వం మరో చోట వందలాది ఎకరాలను సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిందని ఆ లేఖలో ప్రభుత్వం సోదాహరణగా వివరించిన సంగతి తెలిసిందే.

## రామానుజుల దళిత జనోద్ధరణ

హైదరాబాద్, ఇటీవల హైదరాబాద్ ముచ్చింతల్‌లో సమతామూర్తి రామానుజల విగ్రహావిష్కరణతో ఆయన గొప్పతనమేంటో ప్రపంచానికి తెలిసే అవకాశం వచ్చింది. నిజానికి తమిళనాట అప్పట్లో కులాచారాలు బలంగా ఉండేవి. ఆ కాలంలోనే దళితజనోద్ధరణకు రామానుజులు విశేషంగా కృషి చేశారు. చాపకూడు సహా దళితులను ఆళ్వారులుగా స్వీకరించి వారికి మంత్రోపదేశం ఇచ్చారు. అలా చేరిన వారిలో అగ్రగణ్యులు దళితులే. ఇలా రామానుజా చార్యుల వారు ఆనాడే సంఘసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఎప్పుడూ విభిన్నంగా ఆలోచించే ఆయన ఓ రకంగా సంస్కరణ వాది. ఆనాడే అస్పృశ్యతను వ్యతిరేకించారు. ఆయన నిర్మించిన ఆచార్య పరంపరలో దళితులుకూడా ఉన్నారు. చాపకూడు అంటే సహపంక్తి భోజనాన్ని ఆనాడే ఏర్పాటు చేసి ఆచరించి చూపారు. నేర్చుకోవాలన్న తపన ఉన్నవారు ఎవరైనా కులాలకు అతీతంగా ఆహ్వానించారు. అలా వచ్చిన వారు ఎందరో ఆయన శిష్యగణంగా ఉండిపోయారు. ఆకాలంలో ఆడవారికి, బ్రాహ్మణేతరులకి ఉపదేశం అనేదే లేదు. విలువైన మంత్రాలను ఇతరకుల ఉపదేశించకుండా ఉంటే, విలువైనవి మన వద్ద ఉండి కూడా నష్టం ఎందుకు పొందాలి అని రామానుజాచార్యుల వారు ఆనాడే ఆలోచన చేశారు. రుచి ఉన్న వారికి, మేము కూడా బాగుపడతాం, నాకూ తెల్సుకోవాలని ఉంది అనే వారందరికీ అందించాలి అని ఆచార్య పరంపర ఏర్పాటు చేసారు. అలా ఆయన సంస్కరణలకు శ్రీకరాం చుట్టారు. తనవరకు తీసుకుంటే సుమారు 40 సంవత్సరాలు దాటి, సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన జ్ఞాని అయి ఉన్నప్పటికీ చరమ శ్లోకలో ఉన్న గంభీరమైన తాత్పర్యాన్ని తెలుసుకోవడానికి 300 మైళ్ల దూరంలో ఉన్న ఆచార్యుడి వద్దకి నడిచి 18 సార్లు వెళ్తే కానీ అవకాశం లభించలేదు. నాలాంటికే అంత కష్టంగా లభిస్తే సామాన్యులకు మంత్ర ఉపదేశం జరిగే ప్రశ్నే రాదు. అందుకే రామానుజాచార్యుల వారు ఇంత కష్టంగా ఉన్నా మనకే లభించకపోతే మనకు జరిగే నష్టం ఏంతో కదా అని ఆలోచన చేశారు. అట్లా అష్టాక్షరీ, ద్వయ మంత్రం, చరమ శ్లోకాన్ని ఒకేసారి ఉపదేశంగా అందేట్టు చేసారు. రామానుజులకు ముందు ఈ మూడు మంత్రాలు ఒకే సారి ఉపదేశం చేసేవారే కాదు. మంత్రం, మంత్రార్థం కూడా ఒకేసారి లభించేది కాదు. మరిలా అందరికీ చెబితే దాని విలువ పోదా అంటే, మనిషికి ఒకసారి అంటూ సంస్కారం ఏర్పడితే, లోన నిలిచి పోతుంది, క్రమేపి మనపై ప్రభావం చూపుతుంది. మానవ దేహం అనేది సులభంగా లభించలేదు. ఎన్నో జన్మల క్లేషాల తర్వాత వచ్చింది. ఈ మానవ శరీరం అనేది మెరుపు తీగ పాటి అంత కూడా లేదు అని చెబుతారు అళ్వార్లు. అందుకే సంస్కారం అంటూ ఎర్పడితే మానవ జన్మ కంటే క్రిందకి దిగజార కుండా ఉంటుంది. క్రమేపి బాగుపడే అవకాశం ఉందన్నది రామానుజాచార్యులవారు. ఆశించారు.

## ఎగుమతిని నిలిపేసిన చైనా..

వాషింగ్టన్:అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఇరు దేశాలు కూడా ఒకరిపై ఒకరు భారీ సుంకాలను విధించుకుంటున్నారు. తాజాగా, చైనా మరో కీలక నిర్ణయం తీసుకుంది.అమెరికాకు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, లోహాలు, అయస్కాంతాల ఎగుమతుల్ని చైనా నిలిపేసింది. ఇవి ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమేకర్లు, ఏరోస్పేస్ తయారీదారులు, సెమీకండక్టర్‌ల తయారీలో విస్తృతంగా వినియోగిస్తారు.చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది.

చైనా దిగుమతులపై ఆధారపడిన యూఎస్..

అమెరికా చాలా వరకు చైనా దిగుమతులపై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది.

# వక్ఫ్ చట్టంలో వక్రబుద్ధులు...

న్యూఢిల్లీ,కొత్త వక్ఫ్ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసన ఎదుర్కొంటున్న నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ దాన్ని ముస్లింల ప్రయోజనాల కోసమే తీసుకువచ్చినట్టు, వ్యతిరేకించే వాళ్ళు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నట్టు దుష్ప్రచారం ప్రారంభించింది. ఇందుకోసం ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే5 వరకు దేశవ్యాప్తంగా విస్తృతమైన ప్రచారం సాగించాలని కూడా నిర్ణయించుకుంది. మీడియాలో దీనిపై విస్తారమైన కథనాలు ఇప్పటికే వదులుతున్నారు. బిజెపి ముఖ్యమంత్రులైన దేవేంద్ర ఫడ్నవిస్ వంటి వారు బిల్లు చట్టం కాకముందే మహారాష్ట్రలో ఇన్ని వేల ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు దిగారు. నిజంగా ఈ చట్టంలో ఏముంది? లాభమా నష్టమా? నిజంగా రాజకీయ విమర్శ ఉద్యమం అవసరమా? లాంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసులను అత్యవసర ప్రాతిపదికన తీసుకోవాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు ఆమోదించలేదు. వక్ఫ చట్టంపై పిటిషన్లతో పాటు మత మార్పిడుల చట్టాలకు అనుకూలంగా వ్యతిరేకంగా కూడా కేసులలో ఏప్రిల్ 16న విచారణ ప్రారంభిస్తున్నది. ఒక విధంగా ఆ రోజుతో ఈ అంశంపై న్యాయ పోరాటాలు కూడా ప్రారంభమవుతా యన్నమాట. తాము ఈ చట్టాన్ని అమలు జరుపబోమని జార?ండ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు ప్రకటించారు. ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వక్ఫ బోర్డులో ముస్లిమే తరులను నియమించాలనే నిబంధనను ప్రస్తుతానికి పక్కన పెట్టాలని సూచించినట్టు లీకులు ఇస్తున్నారు. ఒక ఎకరం నుంచి 200 ఎకరాల వరకు వక్ఫ ఆస్తుల్ని లీజుకు ఇస్తామని, ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలను ఆహ్వానిస్తూ పత్రికల్లో వ్యాపార ప్రకటనలు జారీ చేసింది. జమ్ము కాశ్మీర్‌లో అయితే ఇప్పుడున్న అధ్యక్షురాలు బిజెపి నియమించబడిన వ్యక్తిగా బలపరుస్తుంటే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కనుక వక్ఫ చట్టం వక్రీకరణలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో ఇప్పుడే తెలిసిపోతున్నది.

అసత్య ప్రచారాలు

1954 వక్ఫ చట్టాన్ని 1995లో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అనుగుణంగా సవరిం చిందని, 2013లో వాటిని మరింత అనుకూలంగా మార్చిందని బిజెపి ఆరోపణ. మైనారిటీల స్థితిగతులను అధ్యయనం చేసి తగు సిఫారసులు చేసేందుకై నియమించబడిన జస్టిస్ సచార్ కమిటీ వక్ఫ ఆస్తుల మీద ఇచ్చిన సూచనల స్ఫూర్తిని కాపాడేందుకే తాము 2024 శాసనం తీసుకొచ్చామని కేంద్ర నేతలు చెప్పుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి) తయారు చేసిన సమాచారంలో కూడా గత బిల్లు ముస్లింలకు అనుకూలంగా ఉందని ఆరోపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భిన్న మతాలతో కూడిన ఈ విశాల దేశంలో మైనారిటీలు అంటే అల్ప సంఖ్యాక వర్గాలు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కలిగి ఉన్నారు. అది ప్రజాస్వామ్య లక్షణం కూడా. మరి వారి మత వ్యవహారాలకు సంబంధించిన చట్టాలు వారికి అనుకూలంగా కాక వ్యతిరేకంగా ఉండటం ఎలా సాధ్యం? ఏ విధంగా న్యాయం? కేంద్రం చేస్తున్న ఈ ఆరోపణలోనే వారి అసలు వ్యూహం అర్థమవుతుంది. బిజెపి దీనిపై హడావుడి పడిందంటే లోక్‌సభ తర్వాత రాజ్య సభలో అర్ధరాత్రి రెండున్నర గంటలకు తీవ్ర వాదోపవాదాల మధ్య ఆమోదింప చేసుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రపతి గజట్ కూడా జారీ చేయడంతో 8వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. చెప్పాలంటే చాలామంది విద్యాధికులకు కూడా ఇప్పటికీ ఈ వ్యవహారం గురించి పూర్తి స్పష్టత రాలేదు. దానికి చాలా సమయం పట్టవచ్చు. కానీ ఆలోగానే వివాదాలు మాత్రం పెరిగిపోవటం, రగిలించడం అనివార్యంగా కనిపిస్తున్నది. ఈ చట్టంలో వ్యూహం, ఉద్దేశం కూడా అది.బుజ్జగింపు రాజకీయాల కోసమే వక్ఫ చట్టంపై వివాదం సృష్టిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. దీని మీద జరిగిన చర్చ చారిత్రాత్మకమైనది అన్నారు. నిజంగానే లౌకికతత్వం, మత సామరస్య సంబంధాల పరిరక్షణపై ఈ చట్టం తీవ్ర ప్రభావమే చూపిస్తుంది.

అన్ని తిరకాసులూ రివర్స్‌లే!

వక్ఫ చట్టం కింద నాలుగు రకాలుగా ఆస్తులు ఏర్పడతాయి. ఒకటి-ఆస్తులను దేవుడికి (అల్లాకు) అప్పగిస్తున్నట్లుగా దాన పత్రాలు, దస్తావేజులు తయారు చేయించడం. రెండు-దాతలు నోటి మాటతో ఏదైనా సందర్భంలో ప్రకటించటం. మూడు-వాడుకలో ఆ స్థలం లేదా ఆస్తి దేవుడి సంబంధమైన మత క్రతువులకు వినియోగంలో ఉండటం. నాలుగు-ప్రభుత్వం వక్ఫకు ఏదైనా భూమిని ఇవ్వటం. ఇప్పుడు ఈ చట్టం ప్రకారం వాడుకలో వక్ఫ అనే అంశం చెల్లదు. దస్తావేజులు తప్పనిసరిగా ఉండాలనేట్టయితే వందల ఏళ్ళ క్రమంలో అనేక వక్ఫ ఆస్తులకు దస్తావేజులు లేవు. రాజులతో సహా నోటి మాటతో ఇచ్చినవి అనేకం. ఆ విధంగానే తరాల పర్యంతం వాడుకలో ఉంటున్నాయి. ఇప్పుడు వాటిని వివాదాస్పదం





చేయటం చాలా సులభం. బాబ్రీ మసీదు రామ జన్మభూమి వివాదం నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి వరకు మనం చూస్తున్నది అదే.అసలు 'వక్ఫ చట్టం' అన్నదాన్ని కాస్త 'ఉమ్మడి నిర్వహణ సాధికారత సమర్థత అభివద్ధి చట్టం' అని మార్చారు. దేవాదాయ ధర్మాదాయ చట్టం కింద ఆలయ భూములు వంటివి చూస్తున్నారు కానీ ఈ రకమైన పరిభాష ఎక్కడా లేదు. వినియోగదారుడు లేదా ధార్మిక సంస్థ దాన్ని వక్ఫకు అప్పగించినట్లు ప్రకటించవచ్చునని ప్రస్తుత చట్టం చెబుతున్నది. 1. ఇప్పుడు చేసిన మార్పుల ప్రకారం ఐదు సంవత్సరాలుగా ముస్లింలుగా ఉండి ఆ విశ్వాసాలు పాటిస్తున్న వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ప్రకటన లేదా దానం ఇతర మతాలవారు చేస్తే చెల్లదని చెప్పడం ద్వారా భిన్న మతాల వారికి అవకాశం లేకుండా పోతున్నది. 2. ప్రభుత్వ ఆస్తులు వక్ఫగా స్థిరపడి ఉంటే గతంలో వాటిని అలాగే పరిగణిస్తున్నారు. కొత్త చట్టంలో వక్ఫ ఆస్తులుగా వాడుకలో ఉన్నవి అలా కొనసాగవు. దీనిపై వచ్చే విభాగాలను కలెక్టర్ ప్రభుత్వం ముందు ఉంచి పరిష్కరిస్తారు. 3. ఏది వక్ఫ, ఏది కాదు అన్నది నిర్ణయించే అధికారం గతంలో బోర్డుకు ఉండేది. ఇప్పుడు ఆ నిబంధనను తొలగించి పూర్తిగా ప్రభుత్వాలకు అప్పగిస్తున్నారు. 4. ఈ ఆస్తులపై సర్వే గతంలో కమిషనర్లు, అదనపు కమిషనర్లు నిర్వహించేవారు. ఇప్పుడు రెవెన్యూ చట్టాల ప్రకారం వాటి నిర్వహించే అధికారం కలెక్టర్లకు అప్పగించారు. 5. గత చట్టంలో ఇద్దరు మహిళలతో సహా ముస్లింలు మాత్రమే ఈ కమిటీ బోర్డుల్లో సభ్యులుగా నియమితులయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడు ఇద్దరు ఎంపీలు, మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ వ్యక్తులు ముస్లింలు కాకపోయినా ఇందులో సభ్యులు కావచ్చు. ముస్లిం సంస్థల ప్రతినిధులు, ఇస్లామిక్ చట్టాలు పండితులు మాత్రమే ఆ మతానికి చెందిన వారై ఉండాలి. వారిలో ఇద్దరు మహిళలు ఉండాలి. 5.ఎన్నికైన ఇద్దరు ముస్లిం ఎంపీలు, ఎమ్మెల్యేలు, బార్ కౌన్సిల్ సభ్యులు రాష్ట్రాల వక్ఫ బోర్డులలో సభ్యులుగా ఉండాలని గతంలో ఉంది. ఇప్పుడు ఇద్దరు ముస్లిం అధికారులను, షియా సున్నీల నుంచి ఒక్కొక్కరిని, బహుళ ఆగాఖాన్ వర్గాల నుంచి ఒక్కొక్కరిని, ఇద్దరు ముస్లిం మహిళలను తప్పనిసరిగా సభ్యులను చేయాలి. 6. ఇక వక్ఫ ట్రిబ్యునల్‌లో ఒక జడ్జి ఆధ్వర్యంలో అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ముస్లిం చట్టాల నిపుణుడు ఉండాలని గత చట్టంలో ఉంటే ఇప్పుడు ముస్లిం చట్టాల నిపుణుడు అన్నది తొలగించారు. జిల్లా కోర్టు జడ్జి చైర్మన్‌గా ఉండగా ప్రభుత్వం తరఫున జాయింట్ సెక్రెటరీ ఉంటారు. 7.ట్రిబ్యునల్ తీర్పులపై గత చట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే హైకోర్టులు జోక్యం చేసుకోవచ్చు. కొత్త చట్టంలో ఏ వివాదమైనా 90 రోజుల లోపల హైకోర్టుకు వెళ్ళవచ్చు. 8.పాత చట్టంలో బోర్డు ఆడిటింగ్ పర్యవేక్షణ అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండేవి. కొత్త చట్టం ప్రకారం కేంద్రానికే అధికారాలు ధారాదత్తం అవుతున్నాయి. అంటే వున్న నిబంధనలు మార్చడం, కొత్తవి చేర్చడం ఆదేశాలు ఏవైనా చేయొచ్చు. భిన్న పార్టీలు పాలించే సందర్భంలో ఇది సమాఖ్య తత్వాన్ని దెబ్బతీయడమే గాక సమస్యాత్మకంగా మారుతుంది 9. షియా సున్నీలు గనక 15 శాతం మించి వుంటే ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయొచ్చని గతంలో వుండేది. ఇప్పుడు ఆగాఖానీ బోహ్రాలకు కూడా ఆ విధంగా వేరే బోర్డుల ఏర్పాటుకు అవకాశమిచ్చారు. వాస్తవానికి వారి సంఖ్య అంత వుండదని, అనవసరంగా చీలికలు తేవడానికే ఈ నిబంధన తెచ్చారని విమర్శలున్నాయి.

సచార్ కమిటీ మాటేంటి?

ఇప్పుడు సచార్ కమిటీ దగ్గరకు వస్తే దాని సిఫార్సులను అమలు చేయడానికి ఈ మార్పులు అన్నది మరీ అవాస్తవం. ఆ కమిటీ చెప్పిన ఒక్క చిన్న సిఫార్సును కూడా ఇందులో పొందుపరచలేదు. ఉదాహరణకు సచార్ కమిటీ వక్ఫ ఆస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చెప్పింది. యుపిఏ ప్రభుత్వం 2014లో దిగిపోయే ముందు రూ.500 కోట్లతో ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది కూడా. కానీ గత పదేళ్లలో ఈ కార్పొరేషన్ నిర్వీర్యమై ఇప్పుడు మూసివేతకు సిద్ధంగా ఉంది.

## బినామీలకే పెత్తనం..గగ్గోలు పెడుతున్న రైతులు



హైదరాబాద్,యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోంది. ఈసారి కూడా కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మహిళా సంఘాలు, పీఏసీఎస్‌లకు అప్పగించింది. ఈ కేంద్రాల నిర్వహణపై బినామీలు కన్నేశారు. గత వానాకాలం సీజన్‌లో కూడా నిర్వహణ పేరు మహిళా సంఘాలది అయితే పెత్తనం మాత్రం బినామీలుగా ఉన్న నిర్వాహకులే చెలాయించారు. మహిళా సంఘాల ప్రతినిధులను కేంద్రాలలో కూలీలుగా పెట్టి రోజువారీ కూలీ ఇచ్చేవారు. ఈసారి కూడా అదే ప్రణాళికతో బినామీలు మహిళా సంఘాలతో తీర్మానాలు పొందేందుకు లోపాయి కారి ఒప్పందాలకు తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే కేంద్రాలు కేటాయింపులు జరుగుతున్నట్లు విపక్ష పార్టీల నేతలు విమర్శలు చేస్తున్నారు. ఆకాల వర్షాలు, ప్రైవేటు మిల్లర్లు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుండటంతో పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు స్పీడ్?చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 8209 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్దం చేసి 2100 సెంటర్లు తెరచి రైతులకు అందుబాటులో ఉంచింది. ఇప్పటివరకు 1.05 లక్షల మెట్రిక్?టన్నులు కొనుగోలు చేసింది. మిగతా కేంద్రాలు దశల వారీగా పలు జిల్లాల్లో ప్రారంభించి జూన్ 30 వరకు కొనుగోలు చేపట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.37 కోట్ల టన్నులు దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసి 70 లక్షల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ టార్గెట్?పెట్టుకుంది.

ధాన్యం సేకరణలో మోసాలు :

బస్తాకు హమాలీ ఖర్చులు వసూలు చేయడం నుంచి మిల్లులో ధాన్యం దించి వచ్చే వరకు ఎన్నో దోపిడీ జరుగుతోందనే ఆరోపణలు న్నాయి. క్వింటాకు రైతు నుంచి హమాలీ తీసుకునేది ఒక్క లెక్క హమాలీలకు ఇచ్చేది మరో లెక్కగా ఉంటుంది. ధాన్యం తూకంలో సాంకేతి కతను ఉపయోగించి ఒక్కో బస్తాకు కిలో నుంచి రెండు కిలోల వరకు అద నంగా తీసుకుంటారు. ధాన్యం మిల్లులో దించే ముందు వేబ్రిడ్జి తూకం వేసి కొనుగోలు చేసిన ధాన్యం రసీదులో ఉన్నదాని కంటే ఎక్కువగా చూపిస్తే అక్కడే మిల్లర్లకు అమ్మకాలు చేసి సొమ్ము ఇద్దరు పంచు కుంటారు. తర్వాత బినామీ రైతుల పేరుతో ధాన్యం కొనుగోలు చేసినట్లు పట్టా పాసు బుక్?లు తీసుకుంటారు. మిలర్ల సహకారంతో డిఎస్ ఓ కార్యాలయంలో వాటిని నమోదు చేయిస్తారు. వచ్చే బోనస్ సొమ్మును మిల్లర్లు, రైతు, నిర్వా హకుడు దర్జాగా జేబులో వేసుకుంటారు. ధాన్యం సొమ్ము రైతు ఖాతా ద్వారా డ్రా చేయించి మిల్లర్లు తమ సొంత వ్యాపారాల కోసం వాడుకుంటారు. దానికి నిర్వాహకులు సహకారం అంది స్తారు. ఈవిధంగా ధాన్యం సేకరణలో అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయి.బీనామీ ఆదేశాల ప్రకామే తూకం : ధాన్యం సేకరణ కేంద్రాల కేటాయింపులు మహిళల సంఘాలకు చేసిన పెత్తనమంతా అధికార పార్టీ నేతలదే. వారు చెప్పిన విధంగా రైతులు ధాన్యం తీసుకొస్తే ఎప్పుడు తూకం వేయాలంటే అప్పడే వేయాలి. ముందుగా అధికార పార్టీకి చెందిన గ్రామ, మండల నాయకులంతా దాదాపు రైతులే కావడంతో వారు ధాన్యం తీసుకొస్తే సాయంత్రంలోగా తూకం వేయాల్సిందే. వారి ధాన్యంలో తాలు, తరుగు, పచ్చిధాన్యం ఉందని ఎలాంటి సాకులు చెప్పకుండా ఉండాలి. అదే విధంగా ఇతర పార్టీలకు చెందిన రైతులు వస్తే పచ్చిగా ఉందని రెండు రోజుల ఆరబెట్టాలని, బస్తాకు రెండు కిలోల తరుగు పేరుతో కోతలు పెడుతున్నారు. అధికారులు కూడా దొడ్డు ధాన్యం, సన్నదాన్యం గుర్తింపులో తేడాలుంటే బినామీలు చెప్పిన వారికి నిర్దారణ చేసి త్వరగా బోనస్?రూ. 500 ఖాతాలో పడేలా వ్యవహరిస్తున్నారని రైతు సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు

## దళితులంటే అప్పట్లో ఛీత్కారమే

ముంబై, 1927లోనే మహాద్‌లో దళిత జాతుల మహాసభ జరిగింది. మహారాష్ట్ర గుజరాత్‌ల నుండి కొన్ని వేలమంది వచ్చారు. మహాద్ చెరువులోని నీటిని త్రాగేందుకు వీలు లేని కాలమది. అంటరానివారికి ఆ చెరువులో ప్రవేశం లేదు. అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది చెరువు నీరు స్వీకరించారు. ఈ సంఘటన మహారాష్ట్రంలో సంచలనం కలిగించింది. 1927లో ఛత్రపతి శివాజీ త్రిశతి జయంతి ఉత్సవాలు మహారాష్ట్ర అంతటా గొప్పగా జరిగాయి. కొలాబాలోని ఉత్సవ సంఘాధ్యక్షుడుగా ఉన్న బ్రాహ్మణుడైన పలాయ శాస్త్రి అంబేద్కర్‌ను సాదరంగా ఆహ్వానించాడు. ఆ ఉత్సవాలలో అంబేద్కర్ ప్రసంగిస్తూ పీష్వాల సామ్రాజ్య పతనానికి ముఖ్యకారణం అస్పృశ్యతను పాటించడమే అన్నాడు. ఈ ఒక్క మాట చూస్తే ఆనాడు అస్పృశ్యత ఎంత విశృంఖలంగా ఉందో చెప్పవచ్చు. బాల్యంలో అంబేద్కర్ ఎదుర్కొన్న అంటరానితన సమస్య అంతా ఇంతా కాదు. ఆనాడు మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించిన కాలమది. వేసవిసెలవుల్లో మామగారున్న గోరెగావ్‌కు భీమ్‌రావ్, అన్న, మేనల్లుళ్ళతో పాటు వెళ్ళాడు. అనుకున్నట్లు, మామ స్టేషన్‌కు రాలేకపోయారు. స్టేషన్ నుండి, గ్రామానికి వెళ్ళటానికి బండిని కుదుర్చుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత బండివాడికి, వీళ్ళు మెహర్ కులస్థులని తెలిసింది. అందరినీ బండి నుండి దిగమన్నాడు. ఎండాకాలం. పిల్లలు ఆ బండివాణ్ణి బతిమాలుకొన్నారు. రెండింతలు బాడుగ ఇస్తామన్నారు. భీమ్‌రావ్ అన్న బండి తోలేటట్లు, బండివాడు నడచి వచ్చేటట్లు మాట్లాడుకున్నారు. ఆకలి దప్పులతో అలమటిస్తూ అర్ధరాత్రికి గోరేగావ్ చేరారు పిల్లలు. వీధికుళాయి నీరు తాగుతూ వున్న భీమ్‌రావ్‌ను కొట్టి మంచినీరు త్రాగకుండా గెంటివేశారు. కులంపేర భీమ్‌రావ్‌ను అవమానాలకు గురిచేశారు. 16వ ఏటనే పెద్దలు అంబేద్కర్‌కు పెళ్ళి చేశారు. అంబేద్కర్ తన 56 ఏట సారస్వత బ్రాహ్మణ కుటుంబా నికి చెందిన కుమారి శారదా కబీర్ ను పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్య 1935లో మరణించింది. 1956 అక్టోబరు 14న నాగ్‌పూర్‌లో అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించాడు. రామ్‌జీ సతారా వదలి పిల్లల చదువు కోసం బొంబాయి చేరాడు. భీమ్‌రావ్ ఎల్ఫిన్‌స్టన్ హైస్కూల్‌లో చేరి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. సంస్కృతం చదువుకోవాలని ఆశించాడు. కులం అడ్డు వచ్చింది. ఇష్టంలేకున్నా పర్షియన్ భాష చదివాడు. బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఏ. పరీక్షల్లో నెగ్గాడు. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పై చదువులు చదవాలన్న పట్టుదలవల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపాడు. విదేశంలో చదువు పూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్లు పనిచేసే షరతుపై 1913లో రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయం చేరాడు. 1915లో ఎం.ఏ. 1916లో పి.హెచ్.డి. డిగ్రీలను సంపాదించాడు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ల తర్వాత 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియా' అను పేరుతో ప్రచురించబడింది. 1917 లో డాక్టర్ అంబేద్కర్‌గా స్వదేశం వచ్చాడు. అప్పటికాతని వయస్సు 27 ఏళ్లు. అస్పృశ్యుడొకడు అంతగొప్ప పేరు సంపాదించుకోవటం ఆనాటి అగ్రవర్ణాలవారికి ఆశ్చర్యం కల్గించింది. ఒప్పందం మేరకు మహారాజాగారి మిలిటరీ కార్యదర్శి అయ్యాడు. కాని ఆఫీసులో నౌకర్లు కాగితాలు ఆయన బల్లపై ఎత్తివేసేవారు! కొల్హాపూర్ మహారాజు సాహూ మహరాజ్ అస్పృశ్యతా నివారణకెంతో కృషి చేస్తుండేవాడు. మహారాజా సహాయంతో అంబేద్కర్ 'మూక నాయక్' అనే పక్షపత్రిక సంపాదకత్వం వహించాడు. సాహు మహారాజు ఆర్థిక సహాయంచేసి అంబేద్కర్ ని పై చదువులకి విదేశాలకు పంపించిండు. 32 సంవత్సరాల వయసులో డా.అంబేద్కర్, బార్-ఎట్-లా, కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి పట్టాలను పొందాడు. కాని ఆఫీసు జవానులు కూడా ఈయనను అస్పృశ్యుడుగా చూచారు. ఆ తరవాత జరిగిన పరిణమాలు అంబేద్కర్‌ను గొప్ప నేతగా అంతా గౌరవించారు.

## కారణం ఇదేనా..?

హైదరాబాద్,వరంగల్‌లో బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్లీనరీ సభపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైలెంట్ అయ్యారు. ఆమెకు పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానం లేదా? అందుకే సన్నాహక సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారా? ప్రస్తుతం గులాబీపార్టీ శ్రేణుల్లో ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. దానికి తగ్గట్లే నిజామాబాద్ జిల్లా నేతల సమావేశాలకు సైతం ఆమె హాజరుకావడం లేదు. పార్టీ పరంగా సరైన ప్రాధాన్యత లేకపోవడంతో ఆమె సొంత ప్లాట్ ఫాం జాగృతితో యాక్టివిటీస్ చేస్తున్నారనే చర్చజరుగుతుంది. ఇక ముమ్మందు కూడా మరింత దూకుడు పెంచాలని కవిత ఆలోచిస్తున్నట్లు సమాచారం.

27న వరంగల్‌లో భారీ బహిరంగసభకు బీఆర్ఎస్ సన్నాహాలు

గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 27న వరంగల్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభను విజయవంతం చేసేందుకు గులాబీపార్టీ సకల ఏర్పాట్లు చేస్తోంది. ఎక్కడికక్కడ పార్టీ కేడర్‌ను సైతం పార్టీ నాయకులు సన్నద్ధం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ జనం తరలింపుపై సలహాలు, సూచనలు తీసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎవరికివారు బిజీగా ఉన్నారు. కానీ కవిత మాత్రం పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, వరంగల్ సభ ఏర్పాట్లకు సంబంధించి సైలెంట్‌గా ఉన్నారు.

సన్నాహక సమావేశాలకు దూరంగా ఉన్న ఎమ్మెల్సీ

ఇంతకూ వేడుకలను ఆహ్వానం అందలేదా?.. కావాలని పార్టీ ఆమెను పక్కన పెట్టిందా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడు పార్టీలో యాక్టివ్‌గా ఉండే కవిత పార్టీ సభ విషయంలో ఎందుకు స్పందించడం లేదనేది ఆమె క్యాడర్‌కే అంతుపట్టడం లేదంట. గ్రేటర్‌లో జరుగుతున్న పార్టీ సన్నాహక సమావేశాల్లో సైతం పాల్గొనడం లేదు. కావాలని ఆహ్వానించడం లేదా? లేకుంటే ఆమె తెలంగాణ జాగృతి సంస్థ ప్రోగ్రామ్స్‌తో బిజీగా ఉండటంతో పాల్గొనడం లేదా? అసలు పార్టీలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.

ఆహ్వానించకుండా పార్టీ కావాలని ఆమెను పక్కన పెట్టిందా?

నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన కవిత 2019లో ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. తిరిగి 2021 నవంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. ఆ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి పట్టుకుంది. కేడర్ , నేతలతోనూ పరిచయాలు ఉన్నాయి. పార్టీ సన్నాహక సమావేశాలు అన్ని జిల్లాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్నాయి. అయితే కవిత మాత్రం ఇప్పటివరకు వెళ్లలేదు. పార్టీ కేడర్ ను సభకు సన్నద్ధం చేయడం లేదు.

తెలంగాణ జాగృతి యాక్టివిటీస్ ముమ్మరం చేసిన కవిత

అంతేకాదు ఇటీవల వారం రోజులపాటు ఉమ్మడి జిల్లాల ముఖ్య నేతలతోనూ ఎర్రవెల్లి ఫాం హౌజ్ లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి.

# బీజేపీకి షాక్ ఇచ్చిన కీలక మిత్ర పక్షం




బీహార్ : బీహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి ఆ రాష్ట్రంలో భారీ షాక్ తగిలింది. ఎన్డీయేలో కీలకంగా ఉన్న రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ గుడ్ బై చెప్పేసింది. ఆ పార్టీ అధినేత పశుపతి కుమార్ పాశ్వాన్. తమకు ఎన్డీయేలో అన్యాయం జరుగుతోంది అని ఆరోపిస్తూ తప్పుకున్నారు.ఆయన ఎవరో కాదు కేంద్ర రాజకీయాల్లో ఒకనాడు కీలకంగా వ్యవహరించిన మాజీ కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ సోదరుడు. ప్రస్తుతం బీహార్ లో లోక్ జనశక్తి పార్టీకి చీఫ్ గా ఉంటూ కేంద్రంలో మంత్రిగా ఉన్న చిరాగ్ పాశ్వాన్ కి సొంత బాబాయ్ఆయన 2019 నుంచి 2024 మధ్యలో కేంద్రంలో మోడీ ప్రభుత్వంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం హాజీపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు కేంద్రంలో మంత్రి పదవి దక్కలేదు. అబ్బాయి కి ఎండీయే పెద్దలు మినిస్టర్ పోస్ట్ ఇచ్చారు.దాంతో చాలా కాలంగా రగిలిపోతున్న ఆయన ఇపుడు సరైన సమయం చూసుకుని షాక్ తినిపించారు అని అంటున్నారు. ఇక బీహార్ రాజకీయాల్లో చిరాగ్ పాశ్వాన్ తో పోటీ పడుతున్న సొంత బాబాయ్ పశుపతి కుమార్ పాశ్వాన్ దళిత సామాజిక వర్గంలో గుర్తింపుని కలిగి ఉన్నారు.ఆయన అనేక సార్లు ఎమ్మెల్యేగా రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. తన సోదరుడు పార్టీ రాజకీయం తన సొంతం అనుకున్న ఆయనకు చిరాగ్ పాశ్వాన్ రూపంలో వారసత్వం పోటీ ఎదురైంది. అయితే బీజేపీ కూడా చిరాగ్ వైపే ఉండడం ఆయనకు మద్దతు ఇవ్వడంతో పశుపతి కుమార్ పాశ్వాన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు.ఇక వచ్చే ఎన్నికల్లఒ బీహార్ లోని మొత్తం 243 స్థానాలకు తాము పోటీ చేస్తామన్నారు. ఇదిలా ఉంటే పశుపతి కుమార్ పాశ్వాన్ ఆయన పార్టీకి ఏకైక ఎంపీ. దాంతో కేంద్రంలో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా బీహార్ లో ఏమైనా ఆయన వల్ల నష్టం ఉంటుందా అన్న చర్చ సాగుతోంది.బీహార్ లో దళితుల అసెంబ్లీ సెగ్మెంట్లు ఎక్కువ. పైగా ఆర్జేడీ కాంగ్రెస్ వామపక్షల నుంచి తీవ్ర పోటీ ఉంది. ప్రతీ ఓటూ ఈసారి ఎన్నికల్లో కీలకం కానుంది. దాంతో ఎంపీగా ఉంటూ రాష్ట్ర మంత్రిగా కేంద్ర మంత్రిగా పనిచేసిన పశుపతి కుమార్ పాశ్వాన్ ఎంతో కొంత ప్రభావం కొన్ని చోట్ల చూపించినా ఓట్ల చీలిక జరిగి ఆ మేరకు ఎండీయే కూటమికి ఇబ్బంది వస్తుందా అన్న చర్చ అయితే ఉంది.అయితే బీహార్ లో దళితులు మైనారిటీలు తమ వైపే అని ప్రత్యర్థి పార్టీలు అంటున్నాయి. ఈసారి ఎన్డీయేని ఓడిస్తామని వచ్చేది ఇండియా కూటమే అని వారు చెబుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఏది ఏమైనా బీహార్ లో ఒక వికెట్ పడింది. శుభమా అని ఎన్నికలకు వెళ్తున్న వేళ ఈ పరిణామం ఏ విధంగా ఉంటుందో అన్నది అంతా చర్చిస్తున్నారు.

# కమల్ హాసన్ రాజ్యసభకు జూలైలో కొత్త రాజకీయ అధ్యాయం?

చెన్నై:ప్రముఖ సినీ నటుడు, మక్కళ్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ త్వరలో పార్లమెంటు ఎగువ సభ అయిన రాజ్యసభలో అడుగు పెట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు ఎంఎన్ఎం పార్టీ వర్గాలు సంకేతాలు ఇచ్చాయి. పార్టీ ఉపాధ్యక్షుడు తంగవేల్ సోమవారం కోయంబత్తూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించడంతో తమిళనాడు రాజకీయాల్లో ఒక్కసారిగా చర్చ మొదలైంది. అంబేద్కర్ జయంతి సందర్భంగా మీడియాతో మాట్లాడిన తంగవేల్, కమల్ హాసన్‌ను రాజ్యసభకు పంపాలని పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కమల్ హాసన్ ఒక సినిమా చిత్రీకరణ కోసం అమెరికాలో ఉన్నారని, ఆయన తిరిగి వచ్చిన తర్వాత జూలై నెలలో రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రకటన కమల్ హాసన్ అభిమానుల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తించింది.

– డీఎంకేతో పొత్తు ఫలితమేనా?

కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లడానికి ప్రధాన కారణం 2021లో జరిగిన తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీ, అధికారంలో ఉన్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే)తో పొత్తు పెట్టుకోవడమేనని తెలుస్తోంది. ఆ సమయంలో జరిగిన ఒప్పందంలో భాగంగానే డీఎంకే, ఎంఎన్ఎంకు ఒక రాజ్యసభ స్థానం కేటాయించేందుకు అంగీకరించిందని సమాచారం. ప్రస్తుతం డీఎంకేకు చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యుల పదవీకాలం జులైలో ముగియనుంది. వీరిలో ఒకరి స్థానంలో కమల్ హాసన్‌కు అవకాశం కల్పించే విషయంపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు తమిళ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కమల్ హాసన్, మరోవైపు గత కొన్నేళ్లుగా రాజకీయాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడం తమిళనాడు రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామంగా పరిగణించవచ్చు.

– రాజకీయాల్లో కమల్ హాసన్ ప్రస్థానం

కమల్ హాసన్ 2018లో మక్కళ్ నీది మయ్యం పార్టీని స్థాపించారు. ఆయన తమిళనాడు రాజకీయాల్లో ఒక ప్రత్యేకమైన మార్పును తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. అవినీతి రహిత పాలన, ప్రజల సమస్యలపై పోరాటం ఆయన పార్టీ ప్రధాన అజెండాగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో, అలాగే 2021 తమిళనాడు శాసనసభ ఎన్నికల్లోనూ ఎంఎన్ఎం పోటీ చేసింది. అయితే, ఆ ఎన్నికల్లో ఆ పార్టీకి పెద్దగా విజయం సాధించలేకపోయింది. కమల్ హాసన్ స్వయంగా పోటీ చేసిన కోయంబత్తూర్ సౌత్ నియోజకవర్గంలో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అయితే, ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రానప్పటికీ, కమల్ హాసన్ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడం పార్టీకి ఒక నూతన ఉత్సాహాన్ని ఇవ్వగలదని భావిస్తున్నారు.



– రాజ్యసభలో కమల్ హాసన్ పాత్ర ఎలా ఉండబోతోంది?

కమల్ హాసన్ రాజ్యసభకు ఎన్నికైతే, ఆయన జాతీయ స్థాయిలో తమిళనాడు ప్రజల సమస్యలను వినిపించే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా తనకున్న సినీ అనుభవం, ప్రజాదరణతో ఆయన జాతీయ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేయగలరు. విద్యా విధానం, పర్యావరణం, కళలు, సంస్కృతి వంటి అంశాలపై ఆయన తన గళాన్ని వినిపించే అవకాశం ఉంది. మరోవైపు, డీఎంకేతో ఉన్న పొత్తు కారణంగా ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలపై తన అభిప్రాయాలను ఏ విధంగా వ్యక్తం చేస్తారనేది కూడా ఆసక్తికరంగా ఉంటుంది. గతంలో పలు సందర్భాల్లో కమల్ హాసన్ కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించిన విషయం తెలిసిందే.

– జూలై కోసం ఎదురుచూపులు

ప్రస్తుతానికి కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లే విషయంపై స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. ఎంఎన్ఎం పార్టీ ఉపాధ్యక్షుడు చేసిన ప్రకటనతో ఈ విషయంపై ఒక స్పష్టత వచ్చినప్పటికీ, అధికారికంగా డీఎంకే నుంచి ప్రకటన రావాల్సి ఉంది. జూలై నెలలో డీఎంకే తమ రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. అప్పటివరకు ఈ విషయంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.మొత్తానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లడం తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త మలుపుగా చూడవచ్చు. ఆయన రాజకీయ ప్రస్థానంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు కానుంది. ఆయన రాజ్యసభలో ఎలా రాణిస్తారో, తమిళనాడు ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది. జూలై నెలలో ఈ విషయంపై మరింత స్పష్టత వస్తుందని ఆశిద్దాం.

# రాజ్ కసిరెడ్డి సమర్పించు ఈడీ క్రియేషన్స్

విజయవాడ:మద్యం కుంభకోణంలో కీలకంగా వ్యవహరించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు రాజ్ కసిరెడ్డి. ఇతగాడికి సంబంధించిన అంశాలపై ఫోకస్ చేసిన అధికారులు ఆశ్చర్యంతో అవాక్కు అవుతున్నారు. ఎందుకంటే.. రాజ్ కసిరెడ్డి వ్యాపార లెక్కల్లోకి వెళుతున్న కొద్దీ బయటకు వస్తున్న వివరాలే. ఎక్కడ చూసినా ఇతగాడి వ్యాపారాలే కనిపిస్తున్నట్లుగా చెబుతున్నారు. మరింత ఆసక్తికరమైన విషయం ఏమంటే.. ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణ జరిపే సంస్థగా అందరికి తెలిసిన 'ఈడీ' పేరు మీదనే ఈడీ క్రియేషన్స్ అంటూ సినిమాలు తీసిన వైనం మరింత ఆసక్తికరంగా మారింది.ఇప్పటివరకు పలు సినిమాల నిర్మాణంలో పెట్టుబడులు పెట్టటమే కాదు కొత్త ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు సైతం సిద్ధమవుతున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. అంతేకాదు.. రియల్ ఎస్టేట్.. విద్యుత్ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టిన రాజ్ కసిరెడ్డి.. కూతురు పేరు మీద ఇషానీ ఇన్ ఫ్రా పేరుతో మరో కంపెనీని ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. వీటికి తోడు హైదరాబాద్ లోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వాటాలు కొన్న విషయాన్ని గుర్తించారు.ఏపీలోని గత ప్రభుత్వ హయాంలో ఒక్కో మద్యం కేసుకు రూ.150 నుంచి రూ.450 వరకు లంచాలు తీసుకున్నారని.. అలా చెల్లించిన కంపెనీలకే మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టినట్లుగా ఆరోపణల సంగతి తెలిసిందే. దీంతో నెలకు రూ.60 కోట్ల చొప్పున మొత్తం 4.2ఏళ్లలో రూ.3వేల కోట్ల మేర కొల్లగొట్టినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న సంస్థల నుంచి లంచాల వసూళ్ల కోసం ఏడు అంచెల వ్యవస్థను ఏర్పాటు చేయటమేకాదు.. ఆ మొత్తం వ్యవహారాల్ని రాజ్ కసిరెడ్డే చూసుకున్నట్లుగా చెబుతారు.ఇలా వసూలు చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని తన వద్దే ఉంచుకున్న రాజ కసిరెడ్డి.. ఆ బ్లాక్ మనీని చలామణీలోకి తెచ్చేందుకు పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టినట్లుగా సిట్ గుర్తించింది. విచారణకు హాజరు కావాలంటూ ఇప్పటికి మూడుసార్లు నోటీసులు ఇచ్చినా.. లైట్ తీసుకున్న వైనం ఒక ఎత్తుగా చెప్పాలి. అంతేకాదు.. ఉల్టాగా తనకు ఏ ప్రాతిపదికన నోటీసులు ఇస్తారంటూ ప్రశ్నించిన వైనం మరో ఎత్తుగా చెప్పాలి. హైకోర్టు ఆదేశాల్ని ధిక్కరించటం.. దర్యాప్తునకు సహకరించకుండా పరారు కావటంతో అతడి కోసం తీవ్రంగా గాలిస్తోంది సిట్.తాజాగా అతడికి సన్నిహితంగా ఉండేవారు.. బినామీలు.. అతడు పెట్టుబడులు పెట్టిన సంస్థలకు సంబంధించిన కార్యాలయాల్లోనూ..



ఆయా సంస్థల డైరెక్టర్ల నివాసాల్లోనూ 50 మంది పోలీసులు హైదరాబాద్ వ్యాప్తంగా మొత్తం 15 చోటల ఏకకాలంలో సోదాలు చేపట్టిన వైనం సంచలనంగా మారింది. సోమవారం మధ్యాహ్నం మొదలైన తనిఖీలు అర్థరాత్రి వరకు సాగుతూనే ఉన్నాయి. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లుగా చెబుతున్నారు.రాజ్ కసిరెడ్డి సతీమణి దివ్యారెడ్డి డైరెక్టర్ గా ఉన్న అరెట్ ఆసుపత్రిలోనూ సిట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాజ్ తన కుమార్తె పేరు మీద ఇషానీ ఇన్ ఫ్రా సంస్థను నిర్వహిస్తున్నారు. ఈడీ క్రియేషన్స్ పేరుతో ఒక బినామీ సంస్థను నడుపుతున్నట్లుగా గుర్తించారు. రాజ్ తోడల్లుడు ముప్పిడి అవినాష్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు చేపట్టారు. హైదరాబాద్ మహానగరంలో పలు చోట్ల అతడికి ఆస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. మంచిరేవులలో కీర్తి వెస్ట్ విండ్స్ టౌన్ షిప్ లోని రాజ్ కసిరెడ్డి అత్తారింట్లోనూ తనిఖీలు చేయటానికి వెళ్లిన టీంకు ఎదురుదెబ్బ తగిలింది.కారణం.. వారు ఐదు రోజుల క్రితమే ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయినట్లుగా గుర్తించారు. అక్కడి సీసీ ఫుటేజ్ ను స్వాధీనం చేసుకున్నారు.ఈ తనిఖీలకు సంబంధించి ముందస్తు సమాచారం రాజ్ కసిరెడ్డికి అందుతున్న విషయాన్ని సిట్ అధికారులు గుర్తించారు. అతడికి ఈ సమాచారాన్ని లీక్ చేస్తున్న వారెవరు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఏపీ పోలీసులకు సంబంధించిన ప్రతి అంశాన్ని రాజ్ కసిరెడ్డికి ముందుగానే అందుతుండటంతో.. అతను మరింత జాగ్రత్తలు తీసుకొని తప్పించుకుంటున్నట్లుగా అధికారులు భావిస్తున్నారు.

# కాంగ్రెస్ కు మోడీ సవాలు మామూలుగా లేదుగా?



న్యూఢిల్లీ,ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదేళ్లు నాన్ స్టాప్ గా పాలన సాగించి.. ముచ్చటగా మూడోసారి సైతం తనకు తిరుగులేదన్న సత్యాన్ని ప్రపంచానికి చాటారు ప్రధాని నరేంద్ర మోడీ. ఆయన రాజకీయాలు ఎంతలా ఉంటాయనటానికి కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఒక నిదర్శనంగా చెప్పాలి. తన ప్రధాన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీ లేవకుండా చేసేందుకు వచ్చే ఏ చిన్న అవకాశాన్ని మోడీ వదులుకోవటం కనిపించదు. అంతేకాదు.. ప్రత్యర్థి విషయంలో అస్సలు కనికరం చూపించని మోడీ తాజాగా వక్ఫ్ సవరన బిల్లుపై ఆ పార్టీ వినిపిస్తున్న వాదనకు.. దిమ్మ తిరిగే షాకిచ్చారు.వక్ఫ్ చట్టాన్ని సవరించటం వెనుక పేద ముస్లింలకు మేలు చేయటమే అసలు కారణమని ప్రధాని మోడీ వాదిస్తున్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ మత రాజకీయాలు చేస్తుందన్న ఆయన తాజాగా ఒక భారీ సవాలు కాంగ్రెస్ పార్టీకి విసిరారు. ముస్లింల మీద నిజంగానే కాంగ్రెస్ పార్టీకి సానుభూతి ఉంటే.. ముస్లింలకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. అంతేకాదు.. ఎన్నికల్లో ముస్లింలకు 50 శాతం టికెట్లు కేటాయించాలని కోరారు. ఈ పనులన్ని కాంగ్రెస్ పార్టీ చేస్తుందా? అని సవాలు విసురుతున్నారు.ఇప్పటికే మైనార్టీ పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలిచింది. ఆ పార్టీ తీసుకునే చర్యల కారణంగా హిందువులు పెద్ద ఎత్తున నష్టపోతున్నట్లుగా జరుగుతున్న ప్రచారానికి మరింత ఊతం కలిగేలా ప్రధాని మోడీ సవాలు ఉందని చెప్పాలి. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వక్ఫ్ నిబంధలన్ని ఆ పార్టీ స్వార్థ పూరితంగా మార్చేసిందన్నారు. పవిత్రమైన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అధికారం కోసం ఆయుధంలా వాడుకుంటే.. ఓటుబ్యాంకు వైరస్ ను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు.గతంలో ఉన్న వక్ఫ్ చట్టం కొంతమంది భూ మాఫియా వ్యక్తులకే ఉపయోగపడిందన్న మోడీ.. ఈ చట్టంతో ముస్లింలకు ఒరిగిందేమీ లేదన్నారు. వక్ఫ్ చట్టానికి తాము చేసిన సవరణలతో టూటీకి తెర పడుతుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ.. ఎస్టీ.. ఓబీసీలకు ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చిందంటూ మండిపడ్డారు. మోడీ తాజా వ్యాఖ్యలకు.. కాంగ్రెస్ ఎలా రియాక్టు అవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. మోడీ విసిరిన సవాలుకు సానుకూలంగా స్పందిస్తే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మొత్తంగామారిపోతుందని చెప్పాలి. మరేం జరుగుతుందో చూడాలి.

# కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీంకు సర్కారు అఫిడవిట్..



హైదరాబాద్,తీవ్ర సంచలనంగా మారటంతో పాటు.. రోజుల వ్యవధిలో సుప్రీంకోర్టు సైతం ఈ అంశం మీద ఫోకస చేయటం తెలిసిందే. అంతేకాదు.. ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి.. దాని సంగతేమిటో తేల్చాలని కోరింది. అవును..ఇదంతా కంచె గచ్చిబౌలికి చెందిన 400 ఎకరాల భూమికి సంబంధించిన అంశం. దీనిపై తాజాగా సుప్రీంకోర్టుకు తన వాదనను అఫిడవిట్ రూపంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసింది. అందులో కంచగచ్చిబౌలి భూములు అడవి ఎంతమాత్రం కాదని.. ఎప్పుడూ అటవీ రికార్డుల్లో లేవని స్పష్టం చేసింది.వివిధ ప్రభుత్వ అవసరాల కోసం రాష్ట్ర ప్రబుత్వం బుల్డోజర్ల ద్వారా భూమిని చదును చేయటం వివాదాస్పదంగా మారటం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు జస్టిస్ బీఆర్ గవాయి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును సుమోటోగా విచారించి.. వెంటనే అక్కడి కార్యకలాపాలపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేయటం తెలిసిందే. అంతేకాదు.. ఐదు అంశాల్ని ప్రస్తావిస్తూ ఈ నెల 16 లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది.

సుప్రీం కోరిన 5 అంశాలు ఏమిటంటే..

1. అటవీ భూమిగా చెబుతున్న ప్రాంతంలో చెట్లను కొట్టేయటంతో పాటు.. ఇతరత్రా డెవలప్ మెంట్ కార్యకలాపాలు చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితి ఏమొచ్చింది?
2. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న అభివృద్ధి కార్యకలాపాలకు పర్యావరణ ప్రభావ మదింపు ధ్రువపత్రం ఉందా?
3. చెట్ల నరికివేతకు అటవీ.. ఇతర స్థానిక చట్టాల కింద అవసరమైన అనుమతులు ఉన్నాయా?
4. సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీలో అటవీ ప్రాంతాల గుర్తింపు అంశాలతో సంబంధం లేని అధికారులను ఎందుకు నియమించారు?
5. ఇప్పటివరకు కొట్టేసిన చెట్లను ప్రభుత్వం ఏం చేసింది?

దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఇందులో కంచె గచ్చిబౌలి భూములు అటవీ ప్రాంతం పరిధిలోకి రావని స్పష్టం చేయటంతో పాటు.. ఇప్పుడే కాదు గతంలో ఎప్పుడూ కూడా ఈ భూముల్ని అటవీ ప్రాంతంగా లేవని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో పేర్కొన్న అంశాల్లో ముఖ్యమైనవి చూస్తే..

– అది ఎప్పుడూ అటవీ భూమిగా లేదు. పూర్తిగా ప్రభుత్వ భూమి.
– రెండు దశాబ్దాలుగా న్యాయవివాదం కొనసాగటంతో ఖాళీగా వదిలేయటంతో చెట్లు పెరిగాయి.
– ప్రభుత్వ కార్యకలాపాల విస్తరణకు ఇది ఉత్తమమైన ప్రాంతం.
– ఈ భూమిపై వివాదం లేదు.
– ప్రభుత్వం డెవలప్ చేస్తే పెట్టుబడులను ఆకర్షించి వేగంగా ఉద్యోగాల సృష్టికి వీలవుతుంది.
– ఈ భూమి ఓపెన్ గా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జంతువులు వచ్చి పోతున్నాయి.
– సెంట్రల్ వర్సిటీ.. ఇదీ కలిపి ఉన్న 2 వేల ఎకరాల్లో జంతువులు తిరుగుతుంటాయి. అంతే తప్పించి వీటికి అవాసం లేదు.
– ఇక్కడ డెవలప్ మెంట్ కార్యక్రమాల్ని చేపట్టిన తర్వాత వాటికి ఇబ్బంది కలగకుండాచర్యలు చేపడతాం.
– ఇక్కడ కొట్టేసిన చెట్లు నిషేధిత విభాగంలోకి రావు. అవసరమైన వాటి కోసం ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి మొక్కలు పెంచుతాం.

# టీటీటీ చైర్మన్,ఈవోలపై టీడీపీ అసహనం!

అమరావతి,టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలారావుపై టీడీపీ అధిష్టానం ఆగ్రహంగా ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఎస్వీ గోశాలలో గోమాతల మృతిపై వీళ్లిద్దరి మధ్య సమన్వయ లోపంతోనే కూటమి ప్రభుత్వం అభాసుపాలైందనే ఆవేదన టీడీపీ పెద్దల్లో వుందని సమాచారం. ఎస్వీ గోశాలలో మూడు నెలల్లో 100కు పైగా గోవులు ప్రాణాలు పోయాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి.ఆ మరుక్షణమే అబ్బే అదంతా ఫేక్ ప్రచారమని టీటీడీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఒకవేళ ఆ ప్రకటనకే కట్టుబడి వున్నా, కనీసం గౌరవం దక్కేది. కానీ టీటీడీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో మధ్య సమన్వయ లోపం, వాళ్ల ప్రెస్‌మీట్లలో వెల్లడైన వివరాలు మరోసారి బట్టబయలు చేశాయి.టీటీడీ చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ 20–22 వరకు గోవులు ప్రాణాలు పోగొట్టుకున్నాయన్నారు. ఏం మన ఇళ్లలో వృద్ధులు, మనుషుల చనిపోవడం లేదా? అని దబాయించారు. తద్వారా గోశాలలో గోవుల ప్రాణాల్ని నిర్ధారించడంతో పాటు ఆయనలో ఏంటీ లెక్కలేని తనం అని టీడీపీ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారని తెలిసింది. మరీ ముఖ్యంగా ఎలాంటి సమాచారం లేకుండానే మీడియా ముందుకొచ్చినట్టు లోకానికి తెలిసేలా మీడియా సమావేశంలో ఆయన వ్యవహార శైలి వుందని సీఎం చంద్రబాబుకు టీడీపీ ముఖ్య నాయకులు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.టీటీడీ ఈవో శ్యామలారావు మీడియాతో మాట్లాడుతూ గత మూడు నెలల్లో 43 ఆవులు చనిపోయినట్టు ప్రకటించడం గమనార్హం. దీంతో టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి ఆరోపణలకు బలం కలిగించినట్టైందని టీడీపీ నేతలు రుసరుసలాడుతున్నారు. మరోవైపు గుంటూరు జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు గోశాలలో గోవులేవీ చనిపోలేదని చెప్పారని, అందరి మాటలు విన్న జనానికి అబద్ధాలు చెబుతున్నారని స్పష్టంగా తెలిసిపోయిందనే చర్చకు తెరలేచింది.టీటీడీలో చైర్మన్, ఈవో మధ్య సమన్వయం కొరవడిందని, తీవ్రస్థాయిలో విభేదాలున్నాయని తొక్కిసలాట సందర్భంలో సీఎం సమక్షంలో బయటపడింది. ఇప్పటికీ వాళ్లిద్దరి మధ్య అదే గ్యాప్ ఉన్నట్టు తాజా గోశాల వివాదంలో రుజువైందని టీడీపీ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారు. భూమన ఆరోపణల్ని ఖండించడానికి బదులు, ఆ రోజే 43 గోవులు చనిపోయినట్టు చెప్పి వుంటే, వివాదం ఇంత వరకూ వచ్చేది కాదు కదా? అని టీడీపీ నాయకుల వాదన.ఆ పని మొదట్లోనే చేయకుండా, డ్యామేజీ జరిగిన తర్వాత , ఎన్ని వివరణలు ఇస్తే ఏం లాభం అని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అలాగే టీటీడీ చైర్మన్, ఈవో ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతూ, అంతిమంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ప్రభుత్వ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారని టీటీడీ నాయకులు చెబుతుండడం గమనార్హం.



## అభిమాని శపథం..నెరవేర్చిన ప్రధాని మోడీ

చండీఘడ్,మోడీ ప్రధాని అయ్యేవరకు , అలాగే స్వయంగా మోడీని కలుసుకునేంతవరకు పాదరక్షలు తొడగనని 2009లో ప్రతిజ్ఞ చేసిన హర్యానా లోని కైతాల్ నివాసి అయిన రామ్‌పాల్ కశ్యప్‌కు ప్రధాని మోడీ పాదరక్షలు తొడిగించారు. సోమవారం నాడు ప్రధాని మోడీ హర్యానా పర్యటన సమయంలో ఈ సంఘటన జరిగింది. తన కోసం 14 ఏళ్లుగా పాదరక్షలు లేకుండా నడుస్తున్న వీరాభిమాని కశ్యప్ శపథాన్ని మోడీ నెరవేర్చారు. దీనికి కశ్యప్ భావోద్వేగంతో చలించిపోయారు. కశ్యప్ ప్రతిజ్ఞ నాకోసం మాత్రమే కాదు. మన దేశానికి

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com